జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్ ‖సంపుటి:1 ‖ సంచిక:35 ‖ ఆదివారం ‖ 5-7-2026 ‖ పేజీలు: 8 ‖ వెల 3/-

05 జూలై 2026 - ఆదివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:50 సూర్యాస్తమయం - సా. 6:50 తిథి పంచమి మ. 1:27 వరకు తరువాత షష్ఠి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం శతభిష మ. 2:59 వరకు తరువాత పూర్వాభాద్ర యోగం ఆయుష్మాన్ సా. 4:35 వరకు కరణం తైతుల మ. 1:27 వరకు గరజి రా. 1:41ం వరకు వర్జ్యం రా. 9:50 నుండి రా. 11:30 వరకు దుర్ముహూర్తం సా. 5:06 నుండి సా. 5:58 వరకు రాహుకాలం సా. 5:13 నుండి సా. 6:50 వరకు యమగండం మ. 12:20 నుండి మ. 1:58 వరకు గుళికాకాలం మ. 3:35 నుండి సా. 5:13 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:14 నుండి తె. 5:02 వరకు అమృత ఘడియలు ఉ. 7:32 నుండి ఉ. 9:14 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:54 నుండి మ. 12:46 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



# ట్రంప్ కొత్త ప్రతిపాదన..!

## మాజీ అధ్యక్షులకు ఆహ్వానం

## వైట్‌హౌస్‌లో ఫుట్‌బాల్ మ్యాచ్

## పాడ్‌కాస్ట్‌లో ఆసక్తికర వ్యాఖ్యలు

**వాషింగ్టన్, జులై 4**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సారి తన వ్యాఖ్యలతో చర్చనీయాంశంగా మారారు. మాజీ అధ్యక్షులు బరాక్ ఒబామా, జో బైడెన్, బుష్ కుటుంబ (మిగతా 2వ పేజీలో)



# కవితకు ఈసీ షాక్..!

## పార్టీ పేరుపై అభ్యంతరాలు

## కొత్త పేర్లు కోరిన ఈసీ

సొంత రాజకీయ పార్టీతో తెలంగాణ రాజకీ యాల్లో కొత్త ప్రస్థానం ప్రారంభించాలనుకుం టున్న కల్వకుంట్ల కవితకు కేంద్ర ఎన్నికల సంఘం కీలక షాక్ ఇచ్చింది.

**హైదరాబాద్, జులై 4**

'తెలంగాణ రక్షణ సేన' పేరుతో పార్టీ నమోదు కోసం దాఖలు చేసిన దరఖాస్తుపై వెయ్యికి పైగా అభ్యంతరాలు వచ్చినట్లు వెల్లడించిన ఎన్నికల సంఘం, అదే పేరుతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగించడం సాధ్యం కాదని స్పష్టం చేసిం ది.పార్టీ నమోదు ముందుకు సాగాలంటే 15 రోజుల్లోగా మూడు ప్రత్యామ్నాయ పేర్లను సమర్పించాలని ఆదే శించింది. కేంద్ర ఎన్నికల సంఘం కవితకు పంపిన అధికారిక లేఖలో నిర్ణీత గడువులోగా కొత్త పేర్లను సూచించాలని పేర్కొంది. లేదంటే (మిగతా 2వ పేజీలో)



## ప్రజాసేవలో

# రెండు దశాబ్దాలు

## రేవంత్ రాజకీయ ప్రస్థానానికి 20 ఏళ్లు

## జెడ్పీటీసీగా ప్రారం భమైన ప్రయాణం

## ముఖ్యమంత్రికి మంత్రుల శుభాకాంక్షలు

## ప్రజాసేవకు అంకితమంటూ అభినందనలు

**హైదరాబాద్, జులై 4**

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రజాప్రతినిధిగా తన రాజకీయ జీవితంలో రెండు దశాబ్దాల మైలురాయిని చేరుకున్నారు. మిడ్జిల్ మండలం జెడ్పీటీసీగా ప్రారంభమైన ఆయన ప్రజాసేవా ప్రస్థానం నేటికి 20 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. గ్రామీణ స్థాయి ప్రజా ప్రతినిధిగా ప్రారంభమైన ఈ ప్రయాణం రాష్ట్ర అత్యున్నత ప్రజాప్రతినిధి పదవైన ముఖ్యమంత్రి స్థాయికి చేరుకోవడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రివర్గ సభ్యులు, (మిగతా 2వ పేజీలో)



# జెడ్పీటీసీ నుంచి సీఎంగా..

## ఉరుకొండపేటలో భావోద్వేగ క్షణాలు

- రూ.10 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- 20 ఏళ్ల జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న సీఎం
- ఆత్మీయులతో ప్రత్యేక సమావేశం

**నాగర్‌కర్నూల్, జులై 4**

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాగర్‌కర్నూల్ జిల్లా ఉరుకొండపేట లోని శ్రీశ్రీశ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు (మిగతా 2వ పేజీలో)



# సంజీవని ఆస్పత్రి సేవలు అమోఘం

## 'గిఫ్ట్ ఆఫ్ లైఫ్' కార్యక్రమంలో పాల్గొనడం

## విజయ్ దేవరకొండతో కలిసి హాజరు

## ఏడాది జీతాన్ని ట్రస్ట్‌కు విరాళం

**సిద్దిపేట, జులై 4**

సిద్దిపేట జిల్లా కొండపాకలోని శ్రీ సత్యసాయి సంజీవని ఆస్పత్రిలో నిర్వహించిన 'గిఫ్ట్ ఆఫ్ లైఫ్' కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సినీ నటుడు విజయ్ దేవరకొండతో కలిసి పాల్గొన్నారు. (మిగతా 2వ పేజీలో)



# అల్లూరి ఆశయాలే నిజమైన నివాళి

## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నివాళులు

## ట్యాంక్‌బండ్‌లో జయంతి వేడుకలు

**హైదరాబాద్, జులై 4**

సమాజంలో అన్యాయాన్ని ప్రశ్నించడం, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడమే మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకు అందించే నిజమైన నివాళి అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. అల్లూరి సీతారామరాజు 129వ జయంతి సందర్భంగా హైదరాబాద్ (మిగతా 2వ పేజీలో)





# జోధ్‌పూర్ విమానాశ్రయానికి నూతన టెర్మినల్

## ప్రధాని చేతుల మీదుగా ప్రారంభం

## రూ.480 కోట్లతో నిర్మాణం.. పర్యాటకానికి కొత్త ఊతం

"రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ విమానాశ్రయంలో నిర్మించిన అత్యాధునిక నూతన టెర్మినల్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. అభివృద్ధి, వారసత్వ పరిరక్షణకు సమ ప్రాధాన్యం కల్పించే దిశగా నిర్మించిన ఈ టెర్మినల్ మార్వార్ ప్రాంతానికి మెరుగైన విమాన అనుసంధానాన్ని అందించడంతో పాటు పర్యాటకం, వాణిజ్యం, ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలు కల్పిస్తుందని పేర్కొన్నారు."

**జోధ్‌పూర్, జులై 4**

సుమారు రూ.480 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ నూతన టెర్మినల్‌లో ఆధునిక సదుపాయాలు కల్పించారు. ప్రయాణికులకు వేగవంతమైన సేవలు, విశాలమైన నిరీక్షణ మందిరాలు, మెరుగైన భద్రతా వ్యవస్థ, (మిగతా 2వ పేజీలో)

## నేటి రాశి ఫలాలు

**మేషం :** ప్రారంభించిన పని పూర్తయ్యే వరకు పట్టుదల వదలకండి. ఆర్థికంగా, సామాజికంగా మంచి ఫలితాలు ఉంటాయి. సమాజంలో పేరుప్రతిష్టలు సంపాదిస్తారు. నమ్మించి మోసం చేసేవారు ఉంటారు జాగ్రత్త వహించండి. ఈశ్వర సందర్శనం శుభప్రదం.

**వృషభం :** వ్యాపారంలో అనుకూల ఫలితాలు ఉన్నాయి. ఒక వ్యవహారంలో డబ్బు చేతికి అందుతుంది. కొత్త వస్తువులు కొంటారు. ఆస్తిని వృద్ధి చేసే క్రమంలో సఫలీకృతులు అవుతారు. తోటివారితో సంతోషంగా గడుపుతారు. ఉద్యోగంలో శ్రమ పెరగకుండా చూసుకుంటే కాలం అనుకూలంగా ముందుకు వెళుతుంది. సూర్య ధ్యానం శుభప్రదం.

**మిథునం :** అనుకూల ఫలితాలు ఉన్నాయి. ప్రారంభించిన పనిలో పురోగతి ఉంటుంది. కీలక వ్యవహారాల్లో అనుకూల ఫలితాలు ఉంటాయి. లాభదాయక ఫలితాలు ఉంటాయి. ఉత్సాహం తగ్గకుండా చూసుకోవాలి. శని ధ్యానశ్లోకం చదివితే మంచిది.

**కర్కాటకం :** మధ్యమ ఫలితాలు ఉంటాయి. మీ మీ రంగాలలో అనుభవజ్ఞుల సహకారంతో పనులను పూర్తి చేస్తారు. మీ బుద్ధిబలంతో తీసుకునే నిర్ణయాలు శక్తిని ఇస్తాయి. ఖర్చులు పెరగకుండా చూసుకోవాలి. నవగ్రహ ధ్యానం శుభప్రదం.

**సింహం :** శ్రమతో కూడిన ఫలితాలు ఉంటాయి. ఉద్యోగ,వ్యాపారాలలో ఎప్పటి పనులు అప్పుడే పూర్తి చేసుకోవడం ద్వారా లక్ష్యసిద్ధి ఉంటుంది. బంధుమిత్రుల సహకారం ఉంటుంది. ఆర్థికంగా బలపడతారు. విష్ణు సందర్శనం ఉత్తమం.

**కన్య :** దైవబలం ఉంది. ఉద్యోగ,వ్యాపారాల్లో ముందుచూపుతో వ్యవహరించాలి. స్థిరాస్తి కొనుగోలు వ్యవహారం లాభిస్తుంది. 'ధైర్యే సాహసే లక్ష్మి' అనే వాక్యాన్ని దృష్టిలో ఉంచుకొని ముందుకు సాగండి, మంచి లాభాలు ఉంటాయి. సూర్య ధ్యానం శుభప్రదం.

**తుల :** ఉద్యోగంలో పై అధికారులతో ఆచితూచి వ్యవహరించాలి. వ్యాపారంలో ఏ పని ప్రారంభించినా ఇట్టే పూర్తవుతుంది. మానసికంగా దృఢంగా ఉంటారు. ఆదాయానికి తగిన వ్యయం ఉంటుంది కాబట్టి పొదుపు సూత్రాన్ని పాటించాలి. సూర్య అష్టోత్తరం చదువుకోవడం శుభప్రదం.

**వృశ్చికం :** గ్రహబలం చాలా బాగుంది. ఉద్యోగంలో అనుకూల ఫలితాలు వస్తాయి. వ్యాపారంలో లాభదాయకంగా ఉంటుంది. ప్రారంభించిన పనిలో మంచి ఫలితాలను అందుకుంటారు. బుద్ధిబలం బాగా పనిచేస్తుంది. మనోధైర్యంతో తీసుకునే నిర్ణయాలు ఫలిస్తాయి. ఈశ్వర సందర్శనం ఉత్తమం.

**ధనుస్సు :** ఉద్యోగంలో మీ పనితీరుకు ప్రశంసలు లభిస్తాయి. ముఖ్యమైన విషయాలకు సంబంధించి పెద్దలను కలుస్తారు, నిర్ణయం మీకు అనుకూలంగా వస్తుంది. ఆర్థిక విషయాలు శుభప్రదంగా ఉన్నాయి. విష్ణు ఆరాధన ద్వారా శుభఫలితాలు కలుగుతాయి.

**మకరం :** గురుబలం రక్షిస్తోంది. దైవానుగ్రహంతో పనులు పూర్తవుతాయి. స్వల్పప్రయత్నంతో ఉద్యోగంలో మంచి ఫలితాలను అందుకుంటారు. ఒక శుభవార్త మీ ఇంట్లో సంతోషాన్ని నింపుతుంది. శ్రీమహాలక్ష్మి సందర్శనం శుభప్రదం.

**కుంభం :** మిశ్రమ కాలం నడుస్తోంది. గ్రహబలం తక్కువగా ఉన్న సమయంలో ప్రయత్నం ఎక్కువగా ఉండాలి. శ్రమకు తగిన ప్రతిఫలం ఉంటుంది. కాలాన్ని సద్వినియోగం చేసుకునే దిశగా ముందుకు సాగండి, సత్ఫలితాలు వస్తాయి. పట్టుదలతో వ్యవహరించి పనులను పూర్తిచేస్తారు. శ్రీరామ సందర్శనం మరింత మేలు చేస్తుంది.

**మీనం :** ఉద్యోగంలో ఉత్సాహంగా ముందుకు సాగితే మంచి ఫలితాలు వస్తాయి. ఆర్థికపరమైన విషయాల్లో ముందుచూపు అవసరం. ఒక సంఘటన మీ మనోబలాన్ని పెంచుతుంది. ఇష్టదైవారాధన శుభప్రదం.



# సంజీవని ఆస్పత్రి సేవలు అమోఘం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా చిన్నారులకు ఉచిత గుండె శస్త్రచికిత్సలు నిర్వహిస్తూ వేలాది కుటుంబాల్లో ఆశ వెలిగిస్తున్న ఆస్పత్రి సేవలను ఆయన ప్రశంసించారు. ఈ ఆస్పత్రి ట్రస్ట్‌కు తన ఏడాది జీతాన్ని విరాళంగా అందజేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం వేలాది మంది చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు చేసి కొత్త జీవితాన్ని అందించడం సాధారణ విషయం కాదన్నారు. చిన్నారులకు పునర్జన్మ ప్రసాదిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది, సేవా సంస్థ ప్రతినిధుల కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ప్రేమ, అంకితభావం,సహనంతో సేవలందిస్తున్న ప్రతి ఒక్కరికీ నమస్కారాలు తెలిపా రు.ఆస్పత్రి వ్యవస్థాపకుడు శ్రీనివాస్ సేవలను కొనియాడిన హరీశ్ రావు,ఆయనను "కనిపించే దేవుడు"గా అభివర్ణించారు.

దేవాల యంలో కనిపించని దేవుడిని ప్రార్థిస్తామని, కానీ ఈ ఆస్పత్రి ద్వారా వేలాది చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న శ్రీని వాస్ నిజమైన సేవామూర్తి అని అన్నారు.తన సంపాదనతోనే సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నా రని కొనియాడారు.ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాల నుంచి వచ్చిన చిన్నారులు ఇక్కడ వైద్యం పొంది ఆరోగ్యం గా తిరిగి వెళ్తుండటం ఆనందంగా ఉందన్నారు. కార్పొరేట్ ఆస్ప త్రులకు ఏమాత్రం తీసిపోని స్థాయిలో పరిశుభ్రత, వైద్య సేవలు, రోగుల పట్ల ఆప్యాయత ఈ ఆస్పత్రిలో కనిపిస్తున్నాయని పేర్కొన్నా రు. తల్లిదండ్రుల కళ్లలో కనిపిస్తున్న ఆనందమే ఈ సేవలకు నిదర్శనమన్నారు.సమాజానికి సేవ చేయడానికి పెద్ద సంపద అవసరం లేదని, ప్రతి ఒక్కరూ తమకు చేతనైనంత మేర ఇతరుల కు సహాయం చేయాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. మనిషి జీవితంలో పదవులు, సంపద కంటే చేసిన సేవే శాశ్వతంగా నిలిచిపోతుందని అన్నారు. తాను ప్రతి సంవత్సరం ఈ ఆస్పత్రిని సందర్శిస్తానని, భవిష్యత్తులో కూడా ఈ సేవా కార్యక్రమాలకు అండగా ఉంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సినీ హీరో విజయ్ దేవరకొండ, ఆస్పత్రి ప్రతినిధులు, వైద్యులు, నర్సులు, సిబ్బంది, చిన్నారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. సేవా కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ సహకరించాలని వక్తలు పిలుపునిచ్చారు.

## ట్రంప్ కొత్త ప్రతిపాదన..!

(మొదటి పేజీ తరువాయి)

సభ్యులను వైట్‌హౌస్‌కు ఆహ్వానించి అందరూ కలిసి ఫుట్‌బాల్ మ్యాచ్ వీక్షిస్తే బాగుంటుందని ఆయన ఆసక్తికర ప్రతిపాదన చేశారు.అమెరికా 250వ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా విడుదలైన ఒక పాడ్‌కాస్ట్‌లో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'స్టోరీటైమ్ విత్ ద సెకండ్ లేడీ' పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ట్రంప్, వైట్‌హౌస్ హిస్టారికల్ అసోసియేషన్ ప్రచురించిన 'ప్రెసిడెంట్స్ ప్లే!' పుస్తకాన్ని చదివి వినిపించారు. గత అమెరికా అధ్యక్షులు తమ విశ్రాంతి సమయాన్ని ఎలా గడిపేవారో వివరిస్తున్న ఈ పుస్తకంలోని అంశాలపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఒక మాజీ అధ్యక్షుడు వైట్‌హౌస్‌లో సూపర్ బౌల్ మ్యాచ్ వీక్షణ కార్యక్రమాన్ని నిర్వహించిన విషయం తనకు కొత్త ఆలోచన కలిగించిందని చెప్పారు."బరాక్ హుస్సేన్ ఒబామా, జో బైడెన్, బుష్ కుటుంబ సభ్యులను వైట్‌హౌస్‌కు ఆహ్వానించి అందరం కలిసి ఫుట్‌బాల్ మ్యాచ్ చూస్తే అది అద్భుతమైన కథనంగా మారుతుంది. మీడియా కూడా దానిపై విస్తృతంగా చర్చిస్తుంది" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. దీనిపై పాడ్‌కాస్ట్ నిర్వాహకురాలు ఉషా వాన్స్ స్పందిస్తూ.. "మాజీ అధ్యక్షుల పునర్మిళనం చాలా సరదాగా ఉంటుంది" అని అన్నారు. బహిరంగ సభల్లో ఒబామా, బైడెన్‌లపై తరచూ విమర్శలు చేసే ట్రంప్ నుంచి ఇలాంటి ప్రతిపాదన రావడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ, మాజీ అధ్యక్షులందరూ ఒకే వేదికపై కలుసుకోవడం అమెరికా రాజకీయాల్లో ప్రత్యేక ఘట్టంగా నిలుస్తుందని పలువురు విశ్లేషిస్తున్నారు.పాడ్‌కాస్ట్ సందర్భంగా ట్రంప్ మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్‌పై కూడా ప్రశంసలు కురిపించారు. వైట్‌హౌస్‌లో రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు చేసిన క్లింటన్‌ను ప్రశంసిస్తూ, తనకు ఆయనంటే ఇప్పటికీ ఇష్టమేనని పేర్కొన్నారు. అయితే తాను మాత్రం వైట్‌హౌస్‌లో రన్నింగ్ ట్రాక్ నిర్మించే ఆలోచన చేయనని సరదాగా వ్యాఖ్యానించారు. అమెరికా మాజీ అధ్యక్షుడు విలియం హోవార్డ్ టాఫ్ట్ గురించి కూడా ట్రంప్ హాస్యభరిత వ్యాఖ్యలు చేశారు. ఆయన అమెరికా చరిత్రలో అత్యంత బరువైన అధ్యక్షుడిగా గుర్తింపు పొందారని గుర్తుచేస్తూ, ఆ రికార్డును తాను బద్దలు కొట్టకూడదని నవ్వుతూ వ్యాఖ్యానించారు. ప్రజల కోసం పనిచేయడం తనకు గౌరవంగా భావిస్తానని, వైట్‌హౌస్‌లో గడిపే ప్రతి క్షణాన్ని దేశ సేవకే అంకితం చేస్తానని ట్రంప్ పేర్కొన్నారు.

## జోధ్‌పూర్ విమానాశ్రయానికి నూతన టెర్మినల్

(మొదటి పేజీ తరువాయి)

అత్యాధునిక సాంకేతిక సదుపాయాలతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా టెర్మినల్‌ను తీర్చిదిద్దారు.ఈ టెర్మినల్ ద్వారా ఏటా 20 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యం ఏర్పడింది. ప్రస్తుతం ఉన్న ప్రయాణికుల రద్దీతో పాటు భవిష్యత్తులో పెరిగే డిమాం డ్‌ను దృష్టిలో ఉంచుకుని విస్తృత సామర్థ్యంతో దీనిని నిర్మించారు.విమానాశ్రయ సేవల నాణ్యత మరింత మెరుగుపడుతుందని అధికారులు తెలిపారు. విమానాశ్రయంలో ఒకేసారి 12 విమానాలు నిలిపివేసేలా ప్రత్యేక పార్కింగ్ బేలు ఏర్పాటు చేశారు. దీంతో విమానాల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. దేశీయ విమానాలతో పాటు భవిష్యత్తులో అంతర్జాతీయ సేవల విస్తరణకు కూడా ఈ మౌలిక వసతులు దోహదపడనున్నాయి. పర్యావరణ హిత సాంకేతికతతో ఈ టెర్మినల్‌ను నిర్మించారు. ఇంధన పొదుపు, సహజ కాంతి వినియోగం, పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా రూపకల్పన చేయడంతో పాటు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక నమూనా లో అభివృద్ధి చేశారు.ఈ నూతన టెర్మినల్ అందుబాటు లోకి రావడం ద్వారా మార్వార్ ప్రాంతానికి మెరుగైన రవాణా అనుసంధానం లభించనుంది. పర్యాటకం, వాణిజ్యం, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రాజస్థాన్ ఆర్థికాభివృద్ధికి ఇది కీలకంగా దోహదపడుతుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

# ప్రజాసేవలో రెండు దశాబ్దాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రిని కలిసి అభినందనలు తెలియజేశారు.ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, ధనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి ముఖ్యమంత్రిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ప్రజాసేవలో 20 సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రితో కొద్దిసేపు వారు రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కూడా చర్చించినట్లు తెలిసింది.రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానం మిడ్జిల్ మండలం జెడ్పీటీసీగా ప్రారంభమైంది. అనంతరం శాసనసభ్యుడిగా,పార్లమెంట్ సభ్యుడిగా ప్రజలకు సేవలందించారు.రాష్ట్ర రాజకీయాల్లో కీలక నాయకుడిగా ఎదిగి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు.ఆ తర్వాత జరిగిన శాసనసభ ఎన్నికల్లో పార్టీని విజయపథంలో నడిపించి తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కొనసాగిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వడమే తన రాజకీయ జీవితానికి మూల సూత్రమని ఆయన పలుమార్లు పేర్కొన్నారు.ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రైతు సంక్షేమం, మహిళల అభ్యున్నతి, యువతకు ఉపాధి అవకాశాలు, పారిశ్రామిక అభివృద్ధి, విద్య, వైద్యం,మౌలిక సదుపాయాల విస్తరణ వంటి రంగాల్లో ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోంది.తెలంగాణ అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న నాయకుడిగా రేవంత్ రెడ్డి ప్రత్యేక గుర్తింపు పొందారని వారు అభినందించారు. రాజకీయ జీవితంలో రెండు దశాబ్దాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో కూడా పెద్ద ఎత్తున శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. జెడ్పీటీసీ స్థాయి నుంచి ముఖ్యమంత్రి పదవి వరకు ఎదిగిన ఆయన ప్రయాణాన్ని ప్రస్తావిస్తూ పలువురు అభినందన సందేశాలు విడుదల చేశారు. గ్రామీణ స్థాయి ప్రజాప్రతినిధిగా ప్రారంభమైన రాజకీయ ప్రస్థానం రాష్ట్ర ముఖ్యమంత్రి పదవికి చేరుకోవడం ఎంతో మంది యువ నాయకులకు స్ఫూర్తిదాయకమని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా మరింత అంకితభావంతో పనిచేయాలని మంత్రులు, ప్రజాప్రతినిధులు ఆకాంక్షించారు. ప్రజాసేవలో మరో ఎన్నో మైలురాళ్లు అధిగమించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

## అల్లూరి ఆశయాలే నిజమైన నివాళి

(మొదటి పేజీ తరువాయి)

ట్యాంక్‌బండ్‌లోని ఆయన విగ్రహానికి మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కేవలం 27 ఏళ్ల వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం, గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం అల్లూరి సీతారామరాజు చేసిన త్యాగం చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. స్వేచ్ఛ కోసం ఆయన సాగించిన పోరాటం భారత స్వాతంత్ర్య ఉద్యమానికి విశేష స్ఫూర్తినిచ్చిందని కొనియాడారు.

"ప్రజల కోసం, ప్రజల ద్వారా, ప్రజల కోసమే" అనే భావజాలంతో అల్లూరి తన జీవితాన్ని అంకితం చేశారని భట్టి పేర్కొన్నారు. ఆయన చూపిన ధైర్యం, త్యాగం, దేశభక్తి నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. అల్లూరి కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాదని, స్వేచ్ఛను ప్రేమించే ప్రతి భారతీయుడి గుండెల్లో చిరస్థాయిగా నిలిచే మహోన్నత శక్తి అని అభివర్ణించారు. నేటి సమాజంలో ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నించే ధైర్యం ప్రతి ఒక్కరిలో ఉండాలని, బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేయడం ద్వారా అల్లూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు.

# జెడ్పీటీసీ నుంచి సీఎంగా..

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు.ఈ సందర్భంగా రూ.10 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి రాకతో ఉరుకొండపేట గ్రామంలో సందడి నెలకొంది. రాజకీయ జీవితంలో జెడ్పీటీసీగా ఎన్నికైన 20 ఏళ్ల నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉరుకొండపేటలో అడుగుపెట్టిన ముఖ్యమంత్రికి గ్రామస్థులు, ఆనాటి సహచరులు, పెద్దలు ఘన స్వాగతం పలికారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ముఖ్యమంత్రి తనతో కలిసి పనిచేసిన పాత సహచరులను ఆప్యాయంగా పలకరించారు.ఒక్కొక్కరితో కరచాలనం చేస్తూ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రెండు దశాబ్దాల క్రితం జరిగిన రాజకీయ ప్రయాణానికి సంబంధించిన అనుభవాలను గుర్తు చేసుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సహచరులు 20 ఏళ్ల క్రితం తీసుకున్న ఫొటోలను చూపిస్తూ అప్పటి సంఘటనలను ముఖ్యమంత్రికి గుర్తు చేశారు.గ్రామ ప్రజల ప్రేమాభిమానాలు ఎప్పటికీ మరువలేనివని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదం, సహచరుల సహకారంతోనే తన రాజకీయ ప్రయాణం ఈ స్థాయికి చేరుకుందని అన్నారు.ఆలయ అభివృద్ధి పనులు పూర్తయితే భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. ఆలయాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎంపీలు వేమ్ నరేందర్ రెడ్డి, మల్లు రవి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కవితకు ఈసీ షాక్..!

(మొదటి పేజీ తరువాయి)

ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా పార్టీ రిజిస్ట్రేషన్ దరఖాస్తును మూసివేస్తామని హెచ్చరించింది. ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది.ఈ నిర్ణయంపై కల్వకుంట్ల కవిత తీవ్రంగా స్పందించారు. ఎన్నికల సంఘం పేర్కొన్న అభ్యంతరాలపై ఇప్పటికే తమవైపు నుంచి పూర్తి వివరణ ఇచ్చామని తెలిపారు. ప్రత్యామ్నాయ పేర్లు పంపే ఉద్దేశం తమకు లేదని, 'తెలంగాణ రక్షణ సేన' పేరుతోనే పార్టీని నమోదు చేయించుకునేందుకు ప్రయత్నిస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే ఈ అంశంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయపోరాటం కూడా చేస్తామని ప్రకటించారు.కొత్త పార్టీ ఏర్పాటుకు సంబంధించి ఈ ఏడాది ఫిబ్రవరిలో కవిత ఐదు పేర్లను కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రతిపాదించారు. 'తెలంగాణ ప్రజా జాగృతి', 'తెలంగాణ జాగృతి', 'తెలంగాణ రక్షణ సేన', 'తెలంగాణ రాష్ట్ర జాగృతి', 'తెలంగాణ ప్రజా శక్తి' పేర్లను పరిశీలన కోసం పంపించారు. అనంతరం ఏప్రిల్ 25న నిర్వహించిన పార్టీ ఆవిర్భావ సభలో 'తెలంగాణ రాష్ట్ర సేన' పేరును ప్రకటించి పార్టీ జెండాను కూడా ఆవిష్కరించారు. అయితే మూడు రోజుల వ్యవధిలోనే పార్టీ పేరును 'తెలంగాణ రక్షణ సేన'గా మార్చుతూ ఎన్నికల సంఘానికి సమాచారం అందించారు. అనంతరం ఈ పేరుపై ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించే ప్రక్రియను ఎన్నికల సంఘం చేపట్టింది. 'రాష్ట్ర సేన' నుంచి 'రక్షణ సేన'గా పేరు మార్చడంపై అప్పట్లోనే రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ జరిగింది.ప్రస్తుతం 'తెలంగాణ రక్షణ సేన' పేరుతోనే కవిత రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కార్యకలాపాలు నిర్వహిస్తూ కేడర్‌ను సమీకరిస్తున్నారు. ఇలాంటి సమయంలో పార్టీ పేరుపై వెయ్యికి పైగా అభ్యంతరాలు రావడం, ప్రత్యామ్నాయ పేర్లు సూచించాలని ఎన్నికల సంఘం ఆదేశించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పుడు అదే పేరును కొనసాగించేందుకు కవిత న్యాయపోరాటం చేస్తారా, లేక కొత్త పేరును ఎంచుకుంటారా అన్నది ఆసక్తికరంగా మారింది.

## శ్వేత సంపాదకీయం

**ఆదివారం 5-7-2026**

# సర్ ప్రక్రియకు రాజకీయ పార్టీలే సహకరించాలి!

సర్ ప్రక్రియతో ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పార్టీలు కంగారు పడుతున్నాయి. ఇబ్బడిముబ్బడిగా ఉన్న మద్దతుదారుల ఓట్లు పోతాయన్న భావనలో ఉన్నారు. ముఖ్యంగా ఆంధ్రావారిలో చాలామందికి తెలంగాణలో ఓటు ఉంది. దీనిపై వారు ఆందోళన చెందుతున్నారు. రెండు ఓట్లు ఉంటే తొలగించడం ఖాయం. అలాగే హైదరాబాద్,విజయవాడ లాంటి తదితర పట్టణాల్లో ఉన్నవారికి కూడా అటు సొంతూళ్లు, ఇక్కడా ఓట్లు ఉన్నాయి. వీటిని తొలగిస్తే ఎలా అన్న ఆందోళనలో ఉన్నారు. అన్నింటికి మించి పాతబస్తీ లోనే ఎక్కువ గందరగోళం కనిపిస్తోంది. ఇక్కడ తిష్టవేసిన రోహింగ్యాలతో పాటు, ఇతర దేశాల వారిని గుర్తించడం కొంచెం  కష్టమే. ఇకపోతే అధికారులు రోజువారీ సమీక్ష చేస్తూ సర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటి వరకు ఎక్కడా ఎలాంటి పొరపాట్లు రాలేదు. నకిలీ ఓట్లను నిరోధించేందుకు పక్కాగా ఓ వ్యవస్థ అంటూ లేదు. ఆధార్, పాన్ కార్డులకు పర్మినెంట్ నంబర్ ఉంటోంది. కానీ ఓటుకు అలాంటిదేమీ లేదు. అలాంటి పక్కా వ్యవస్త ఉంటే తప్ప ఎన్నిసార్లు సర్ ప్రక్రియ చేపట్టినా నకిలీ ఓట్లు తొలగింపు అసాధ్యమే. ఇకపోతే ఇల్లుమారిన లేదా, చనిపోయిన వారి ఓట్లను ఎలా తొలగిస్తారన్నది కూడా ప్రశ్నే. ఇదిలావుంటే అన్ని రాజకీయ పార్టీలు సమావేశాలు పెట్టి తమ కార్యకర్తలను అప్రమత్తం చేస్తున్నాయి. ఓట్లు తొలగిపోకుండా చూడాలని జాగ్రత్తలు చెబుతున్నాయి. అందుకు బూత్‌లెవల్లో శిక్షణ కూడా ఇచ్చారు. ఓ వైపు ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే సమావేశాలు కొనసాగుతున్నాయి. దీనిని బట్టి రాజకీయ పార్టీల్లో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. నకిలీ ఓట్లను తొలగించే విధానాన్ని కేంద్ర ఎన్నికల సంఘం సర్ ద్వారా గత కొన్నేళ్లుగా సంస్కరిస్తోంది.  ఇది కొత్తగా బిజెపి ఏలుబడిలో తీసుకువచ్చిందేమీ కాదు. గతంలో యూపిఏ హయాంలోనూ సర్ ప్రక్రియ సాగింది. అయితే అప్పట్లో తూతమంత్రంగా సాగడంతో ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు.

'సర్' పక్రియ చట్టబద్ధమేనని, కానీ వాటి కోసం అవలంబించే పద్ధతుల్లో మార్పులు తెచ్చుకోవాలని ఈ దేశ అత్యున్నత న్యాయస్థానం అన్ని రాజకీయ పార్టీలకు, కేంద్ర ఎన్నికల సంఘానికి హితవు చెప్పింది. ఓటు హక్కు ఒకటే యువత భవిష్యత్‌ను నిర్మించుకునేందుకు ఉన్న ఏకైక ఆయుధమని నమ్ముతుంటాం. ఓటు ఉంటేనే నేతలు ఉంటారు. అధికారం ఉంటుంది. అందుకే ఓట్ల కోసం అభ్యర్థులు, పార్టీలు డబ్బులు విరజిమ్మడం ద్వారా అధికార పీఠం దక్కించుకునేందుకు నానా గడ్డీ కరుస్తుంటారు. ఇప్పుడు సర్ ప్రక్రియ ద్వారా తమవారి ఓట్లు పోకుండా జాగ్రత్త పడడం ఇందులో భాగమే. ప్రజాస్వామ్యంలో ధనస్వామ్యం చొరబడిన తరవాత ప్రజాస్వామ్యం ఇప్పుడు వికటిస్తున్నది. ఈ పరిస్థితుల్లో 'ఓటు' దుర్వినియోగం అవుతోంది. డబ్బులు పెట్టి ఓట్లు కొనసడం అలవాటు చేసుకున్నారు. దొంగ ఓట్లతో జాతర నడిపిస్తున్నారు.  స్థానికంగా లేని వారికి ఓటు హక్కు కల్పించడం, ఆ ఓటును ఎవరో వేసేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో సర్' పేరుతో అసలుసిసలు ఓటర్లను జాబితాలోంచి తీసేస్తున్నారన్న ఆరోపణల మధ్య రాజకీయ పార్టీలు ఓట్లను దక్కించుకునేందుకు జాగ్రత్త పడుతున్నాయి. బీహార్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, తదితర రాష్ట్రాలకు సర్ ప్రక్రియ పూర్తయిన తరవాతనే  ఎన్నికలు జరిగాయి. కొన్ని చోట్ల ప్రభుత్వాలు మారడంతో ఓట్లను తొలగిస్తున్నారన్న ప్రచారం చేపట్టారు. ఇంత ప్రక్షాళన జరిగినా కొన్ని చోట్ల అక్రమంగా తమ ఓట్లు తొలగించారన్న ఆవేదనలు వినిపిస్తూనే ఉన్నాయి. సాధారణ పౌరులెవరికీ 'సర్' పట్ల ఎలాంటి అసంతృప్తి లేదు. ఈ పక్రియలో ఓటు హక్కు కోల్పోయామని ఆందోళన చెందిన ఓటర్లు కూడా ఇప్పుడు ఒక్కక్కరూ ఆందోళన చెందుతున్నారు. ఏ వ్యవస్థలో అయినా లోపభూయిష్టమైన విధానాలకు చెక్ పెట్టాల్సిందే. ఓటు ఉన్నవారు నిర్భయమంగా ఉండాల్సిందే. ఎలాంటి ఆందోళనలు అవసరం లేదు.

ఎన్నికల సంఘం కూడా అలాంటి వారిని ఎక్కడా తప్పు పట్టడం లేదు. జాబితాలో తొలగించడం లేదు. అవగాహన లేనివారు మాత్రమే ఆందోళనతో అయోమయంలో పడిపోతున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితా ఎంతో విశ్వసనీయత కలిగి ఉండటం అవసరం. రెండు ఓట్లు, ఇక్కడ లేని వారి ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు తొలగించేందుకు ఇసికి రాజకీయ పార్టీలు సహకరిస్తే సమస్య సులువుగా పరిష్కారం అవుతుంది. కానీ రాజకీయా పార్టీలు అలా చేయడం లేదు. రాజకీయ పార్టీల చర్యలు ఓటర్లలోనూ గందరగోళంలఅఓ పడేసేలా ఉంటోంది. ఓట్లు పోతాయంటూ చేస్తున్న హెచ్చరికలు భయాందోళనకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారు తమ ఓటు ఎక్కడ పోతుందో అన్న ఆందోళన చెందుతున్నారు.  శాశ్వతంగా ఒకే ప్రాంతంలో నివసించే వారిఓట్ల జోలికి ఇసి వెళ్లడం లేదు. కొన్ని చోట్ల తాము వెళ్లినప్పుడు ఓటర్లు అక్కడ లేకపోవడం, తగిన కారణాలు చూపక పోవడంతో తొలగించడం జరుగుతోంది. ఇంటింటికీ వెళ్లి ధృవీకరణద్వారా జాబితాను జల్లెడ పడుతున్నారు. ఒకటి కన్నాఎక్కువ ప్రాంతాల్లో పేర్లు నమోదై, వారు మరో చోట నివసిస్తుంటే వారి ఓటు హక్కు ఆ ప్రాంతానికే మార్చుకోవాలి. ఎక్కడ శాశ్వత నివాసం ఉంటుందో అక్కడే ఓటును పొందాలి. అంతేగానీ పలుచోట్ల ఓటును కలిగి ఉండడం కూడా నేరం. ఇలాంటి విషయాలను రాజకీయా పార్టీలు ప్రచారం చేయడం లేదు. రాజకీయ ఎత్తుగడ కోసం ఓట్లు తొలగిస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నాయి. 'సర్' పూర్తిగా చట్టబద్ధమైన పారదర్శక పక్రియ అనడంలో సందేహమే లేదు. కేంద్ర ఎన్నికల సంఘం తరచు సమీక్షలు చేయడం ద్వారా ఓటర్ల గుర్తింపునకు వెసులు బాటుగా అవగాహన కల్పించడం, వారి ఓటుకు చోటు లభించేటట్లు చేయడం అత్యంతావశ్యకం. అవగాహనలోపం వల్ల అర్హులైన ఓటర్లు కూడా తమ 'ఓటుహక్కును దక్కించుకోవడం కోసం అజాగ్రత్తగా ఉండరాదు. రాజకీయ పార్టీలు గ్రామాల వారీగా జాబితాలు ముందుర వేసుకుంటే ఎవరు స్థానికులో ఎవరు కాదో తెలుస్తుంది. ఎవరు ఓటరో కాదో తెలుస్తుంది. చనిపోయిన వారు ఎవరో  కూడా వారికి తెలుసు. ఇలాంటి విషయాల్లో ఆయా పార్టీలు నేరుగా ఎన్నికల సంఘానికి సహకరించి, అనర్హత కలిగిన ఓట్లను తొలగించాలి. అప్పుడే ఓటరు సమగ్ర జాబితా రూపొందగలదు.



# రంకెలు వేస్తే అంకెలు మారవు

**డిప్యూటీ సీఎం భట్టికి హరీశ్ రావు కౌంటర్**

**బీఆర్ఎస్ చేసిన అప్పు రూ.4.17 లక్షల కోట్లు**

**కాగ్ రిపోర్టే దీనికి నిదర్శనమంటూ హరీశ్ లెక్కలు**

**బ్రోకర్లకు లంచాలిచ్చి దొంగచాటుగా అప్పులు తెస్తున్న ప్రభుత్వం**

**అసెంబ్లీ పెట్టండి, అప్పుల చిట్టా తేలుద్దామంటూ హరీశ్ సవాల్**

బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన అప్పు అక్షరాలా రూ.4.17 లక్షల కోట్లేనని అసెంబ్లీ సాక్షిగా చెప్పిన లెక్కకు ఇప్పటికీ, ఎప్పటికీ కట్టుబడి ఉంటామని, దీనిపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధమని అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావు స్పష్టం చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంత్రి జూపల్లి సవాళ్లు చేసి తోక ముడిచిన అవమానం నుంచి బయటపడటానికే, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రెస్ మీట్ పెట్టి అప్పులపై రూ.8.21 లక్షల కోట్లంటూ పాత కట్టుకథలను, తప్పుడు లెక్కలను వండి వార్చారని ధ్వజమెత్తారు.

హైదరాబాద్, జూలై 04: రంకెలు వేసినంత మాత్రాన అంకెలు మారవని భట్టికి హితవు పలికారు. అంతేకాకుండా తాము అధికారంలోకి రాకముందు నాటి రూ. 84,268 కోట్ల అప్పును, కాంగ్రెస్ వచ్చాక చేసిన రూ. 15,118 కోట్ల అప్పును కూడా బీఆర్ఎస్ ఖాతాలోనే వేసి భట్టి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. శ్వేతపత్రంలో ఒక లెక్క, సీఎం రేవంత్ అసెంబ్లీలో రూ. 3.47 లక్షల కోట్లని ఒక లెక్క, భట్టి మరో లెక్క చెబుతూ డైవర్షన్ డ్రామాలు ఆడుతున్నారని హరీశ్ ఎద్దేవా చేశారు.

### 31 నెలల్లో ప్రభుత్వం అప్పు రూ.4.50 లక్షల కోట్లు

బీఆర్ఎస్ హయాంలో తెచ్చిన రూ. 4.17 లక్షల కోట్ల అప్పుతో కాళేశ్వరం, మిషన్ భగీరథ, పాలమూరు ఎత్తిపోతల వంటి ప్రాజెక్టులు నిర్మించామని, రూ. 72,972 కోట్ల రైతుబంధు, రూ. 29 వేల కోట్ల రుణమాఫీ, ఉచిత విద్యుత్ అందించడంతో పాటు సచివాలయం, కమాండ్ కంట్రోల్ సెంటర్, మెడికల్ కాలేజీలు నిర్మించి చూపామని హరీశ్ రావు గుర్తుచేశారు. తలసరి ఆదాయాన్ని, రాష్ట్ర జీఎస్డీపీని భారీగా పెంచామన్నారు. మరి అపారమైన అనుభవం ఉందని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ 31 నెలల్లో ఏకంగా రూ. 4.50 లక్షల కోట్ల అప్పు ఎందుకు చేసిందని నిలదీశారు. కరోనా లాంటి సంక్షోభాలున్నా కేసీఆర్ ఏనాడూ రాష్ట్రం దివాళా తీసిందని అనలేదని, కానీ నేడు రేవంత్ రెడ్డి దక్షత లేని పాలన వల్ల అప్పు పుట్టడం లేదని దిగజారి మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎన్నికల హామీలను అమలు చేయలేక, తమ ప్రభుత్వ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికే అప్పుల నెపం బీఆర్ఎస్ పై నెడుతున్నారని మండిపడ్డారు.

### బ్రోకర్లకు కమీషన్లు ఇస్తూ అప్పులు

కాంగ్రెస్ ప్రభుత్వం బాండ్ల ముసుగులో ఎఫ్ఆర్బీఎం పరిధి దాటి, సచివాలయం చుట్టూ బాంబే, గుజరాత్ బ్రోకర్లను తిప్పుతూ వందల కోట్ల కమీషన్లు ఇస్తూ దొంగదారిన అప్పులు తెస్తోందని హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. టీజీఐఐసీ, హెచ్ఎండీఏ భూములను కుదువబెట్టి తెచ్చే రూ. 30 వేల కోట్ల అప్పు కోసం బ్రోకర్లకు రూ. 510 కోట్లు కమీషన్ ఇస్తున్నారని, అలాగే డిస్కమ్‌లు, మూడు హైదరాబాద్ కార్పొరేషన్ల ద్వారా తలపెట్టిన రూ. 70 వేల కోట్ల అప్పుకు మరో రూ. 1,200 కోట్లు లంచాలు ఇస్తున్నారని లెక్కలతో సహా బయటపెట్టారు. లక్ష కోట్ల అప్పు కోసం రూ. 1,710 కోట్ల ప్రజల సొమ్మును బ్రోకర్ల పాలు చేస్తున్న దిక్కుమాలిన ప్రభుత్వం దేశ చరిత్రలోనే మరొకటి ఉండదని ధ్వజమెత్తారు. ప్రభుత్వమే అప్పుల కోసం బ్రోకర్లకు లంచాలు ఇచ్చే పరిస్థితికి దిగజారిందని, అందుకే రేవంత్ రెడ్డిని దేశంలో దొంగలా చూస్తున్నారని విమర్శించారు. తాము చెప్పిన రూ. 4.17 లక్షల కోట్ల లెక్కలు తప్పని నిరూపించే ధైర్యం ఉంటే తక్షణమే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని, తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని హరీశ్ రావు సవాల్ విసిరారు.


## 12వ తరగతి లేదా డిగ్రీ తర్వాత యూకేలో చదవాలనుకుంటున్నారా? ఇవి తెలుసుకోండి

విదేశీ విద్యపై ఆసక్తి చూపుతున్న భారతీయ విద్యార్థుల సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతోంది. ముఖ్యంగా 12వ తరగతి లేదా డిగ్రీ పూర్తయిన తర్వాత ఉన్నత విద్య కోసం యునైటెడ్ కింగ్‌డమ్ (ఖఖ)ను ఎంచుకుంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. అయితే విదేశీ విద్యకు సిద్ధమయ్యే ముందు కొన్ని ముఖ్యమైన విషయాలపై అవగాహన కలిగి ఉండటం అవసరమని విద్యా నిపుణులు సూచిస్తున్నారు.

**ముందుగా కోర్సు ఎంపికపై స్పష్టత అవసరం**

విద్యార్థులు తమ ఆసక్తులు, నైపుణ్యాలు మరియు భవిష్యత్ ఉద్యోగ అవకాశాలను దృష్టిలో పెట్టుకుని కోర్సును ఎంపిక చేసుకోవాలి. ఇతరులు ఎంచుకున్న కోర్సులను అనుసరించడం కంటే, వ్యక్తిగత లక్ష్యాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవడం మంచిది.

**సరైన యూనివర్సిటీ ఎంపిక ఎంతో ముఖ్యం**

యూనివర్సిటీ ర్యాంకింగ్ మాత్రమే కాకుండా, కోర్సు నాణ్యత, పరిశ్రమలతో అనుసంధానం, ఇంటర్న్‌షిప్ అవకాశాలు, విద్యార్థులకు అందించే సేవలు, క్యాంపస్ వాతావరణం వంటి అంశాలను కూడా పరిశీలించడం అవసరం.

**అడ్మిషన్ కోసం అవసరమైన పత్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలి**

విద్యార్థులు తమ విద్యా సర్టిఫికెట్లు, మార్కుల మెమోలు, పాస్‌పోర్ట్, ఇంగ్లీష్ భాషా ప్రావీణ్యానికి సంబంధించిన అర్హతలు (అవసరమైతే), ఇతర అవసరమైన పత్రాలను ముందుగానే సిద్ధం చేసుకుంటే అడ్మిషన్ ప్రక్రియ సులభంగా పూర్తవుతుంది.

**స్కాలర్‌షిప్ అవకాశాలను తెలుసుకోవాలి**

అనేక యూకే విశ్వవిద్యాలయాలు అంతర్జాతీయ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నాయి. అర్హత ఉన్న విద్యార్థులు ఈ అవకాశాలను వినియోగించుకోవడం ద్వారా విద్యా వ్యయాన్ని తగ్గించుకోవచ్చు.

**ఆర్థిక ప్రణాళిక కూడా అవసరమే**

ట్యూషన్ ఫీజుతో పాటు వసతి, ఆహారం, ప్రయాణం వంటి జీవన వ్యయాలను ముందుగానే అంచనా వేసుకుని ప్రణాళిక రూపొందించుకోవాలి. అవసరమైతే విద్యా రుణాలు మరియు ఇతర ఆర్థిక వనరులపై కూడా సమాచారం సేకరించాలి.

**వీసా ప్రక్రియపై సరైన అవగాహన ఉండాలి**

యూనివర్సిటీ అడ్మిషన్ వచ్చిన తర్వాత స్టూడెంట్ వీసా కోసం అవసరమైన పత్రాలు, నిబంధనలు, దరఖాస్తు విధానం వంటి అంశాలను జాగ్రత్తగా పాటించడం ఎంతో ముఖ్యం. పూర్తి సమాచారంతో దరఖాస్తు చేస్తే ప్రక్రియ మరింత సులభంగా పూర్తవుతుంది.

విదేశీ విద్య అనేది కేవలం మరో దేశానికి వెళ్లడం మాత్రమే కాదు. సరైన ప్రణాళిక, సరైన మార్గదర్శకత్వం, స్పష్టమైన లక్ష్యం ఉంటే అది విద్యార్థి జీవితాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లే అవకాశంగా మారుతుంది.

యూకేలో బ్యాచిలర్స్ లేదా మాస్టర్స్ చదవాలని భావిస్తున్న విద్యార్థులకు యూనివర్సిటీ ఎంపిక, కోర్సు ఎంపిక, స్కాలర్‌షిప్ అవకాశాలు, అడ్మిషన్ ప్రక్రియ, డాక్యుమెంటేషన్, స్టూడెంట్ వీసా మార్గదర్శకత్వం వంటి అంశాల్లో EXXEELLA Educational Group సమగ్ర సేవలను అందిస్తోంది.



మరిన్ని వివరాలకు
EXXEELLA
Educational Group
Bhanu Sairam Arepu
Educational Counsellor
9100749422
applications@exxeella.com

# టేబుల్ టెన్నిస్ టోర్నీకి బ్రాహ్మణి శ్రీకారం

**హైదరాబాద్, జులై 4**

లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాలుగో తెలంగాణ రాష్ట్ర ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్--2026ను నారా బ్రాహ్మణి ప్రారంభించారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొన్న యువ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, క్రీడల్లో ప్రతిభ కనబరిచే యువతను ప్రోత్సహిం చడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా బ్రాహ్మ ణి మాట్లాడుతూ.. ఈ టోర్నమెంట్ తనకు ఎంతో ప్రత్యేకమని చెప్పారు. తన తండ్రి చదువుకున్న విద్యాసంస్థలోనే ఈ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు జరగడం తనను భావోద్వేగానికి గురి చేసిందని పేర్కొన్నారు. లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌తో తమ కుటుంబానికి ఉ న్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి 500 మందికి పైగా యువ క్రీడాకారులు ఈ టోర్నమెం ట్‌లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని బ్రాహ్మణి అన్నా రు. చిన్న వయసులోనే వారు ప్రదర్శిస్తున్న ఆత్మవిశ్వాసం, క్రమ శిక్షణ, పట్టుదల, క్రీడాస్ఫూర్తి తనను ఎంతగానో ఆకట్టుకు న్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో వీరిలో ఎంతో మంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారనే నమ్మకం వ్యక్తం చేశారు. క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి, నాయకత్వ లక్షణాల పెంపొందింపుకు ఎంతో దోహదపడతాయని ఆమె అన్నారు. గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించే మనస్తత్వాన్ని క్రీడలు నేర్పుతాయని, ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోనూ పాల్గొనా లని సూచించారు. టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులతో బ్రాహ్మణి ముచ్చటించి వారి సాధన, లక్ష్యాల గురించి తెలుసు కున్నారు. నిర్వాహకులను అభినందిస్తూ ఇలాంటి రాష్ట్రస్థాయి పోటీలు యువ క్రీడాకారుల్లో ప్రతిభను



వెలికితీయడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో క్రీడల అభివృద్ధికి ఇటువంటి పోటీలు మరింత దోహదపడతాయని, యువ క్రీడాకారులకు అన్ని విధాలా ప్రోత్సాహం అందించాలని ఆమె పిలుపునిచ్చారు. రాష్ట్రస్థాయి పోటీల ద్వారా కొత్త ప్రతిభ వెలుగులోకి రావడంతో పాటు భవిష్యత్తులో దేశానికి పతకాలు సాధించే క్రీడాకారులు తయారవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.



# విక్టోరియా ప్రతినిధితో శ్రీధర్‌బాబు భేటీ

**హైదరాబాద్, జులై 4**

తెలంగాణ ప్రభుత్వం -- ఆస్ట్రేలియాలోని విక్టోరియా రాష్ట్రం మధ్య పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కీలక సమా వేశం నిర్వహించారు. రాష్ట్ర సచివాలయంలో విక్టోరియా శాసన మండలి ప్రభుత్వ విప్ లీ టార్లామిస్‌ను కలిసి సాంకేతికత, ఆవిష్కరణలు, విద్య, ఆధునిక తయారీ పరిశ్ర మలు, పెట్టుబడుల అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా రెండు ప్రాంతాల మధ్య పరస్పర భాగ స్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు ఉన్న అవకాశా లను ఇరువురు నాయకులు సమీక్షించారు. సమాచార సాంకేతి కత, నూతన ఆవిష్కరణలు, పరిశోధన, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో కలిసి పనిచేసే అవకాశా లపై అభిప్రాయాలు పంచుకున్నారు. తెలంగాణలో పెట్టుబడు లకు అనుకూలమైన వాతావరణం, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, పారిశ్రామిక విధానాలను శ్రీధర్‌బాబు వివరిం చారు. ఆధునిక తయారీ రంగంలో విక్టోరియా రాష్ట్రానికి చెందిన సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. దీంతో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు పారిశ్రామి కాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు.



# హైకోర్టు న్యాయమూర్తికి కలెక్టర్ స్వాగతం

**భద్రాద్రి కొత్తగూడెం, జులై 4 :**

తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ జె. శ్రీనివాస్ రావు జిల్లా పర్యటన సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. పూల మొక్కను అందజేసి ఆయనకు ఆత్మీయ స్వాగతం తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా భద్రాద్రి కొత్త గూడెం జిల్లాకు చేరుకున్న జస్టిస్ జె. శ్రీనివాస్ రావును జిల్లా అధికారులు సాదరంగా ఆహ్వానించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ ఆయనను కలిసి పర్యటనకు స్వాగతం పలుకుతూ జిల్లా పరిపాలనకు సంబంధించిన పలు అంశాలపై సంక్షిప్తంగా వివరించినట్లు సమాచారం. అనంతరం జస్టిస్ జె. శ్రీనివాస్ రావు జిల్లా పర్యటన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. న్యాయవ్యవస్థకు సంబంధిం చిన కార్యక్రమాలను పరిశీలించడంతో పాటు జిల్లా స్థాయిలో అందుతున్న న్యాయ సేవలపై అధికారులతో చర్చించినట్లు తెలిసింది.

# రోశయ్యకు ఘన నివాళులు



**హైదరాబాద్, జులై 4**

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత కొణిజేటి రోశయ్య 93వ జయంతి వేడుకలు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, కొణిజేటి రోశయ్య మెమోరియల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ప్రముఖ ప్రవచనకర్త, పద్మశ్రీ పురస్కార గ్రహీత గరికపాటి నరసింహారావును రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి ఘనంగా సన్మానించారు. అనంతరం కేఎస్‌ఆర్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ లోగోను ఆవిష్కరి ంచారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కొణిజేటి రోశయ్యకు ఘన నివాళులు అర్పించారు. రాజకీయాల్లో నిజాయితీ, నిబద్ధత, పారదర్శకత, ప్రజాసేవకు రోశయ్య ప్రతీకగా నిలిచారని అన్నారు. ఐదు దశాబ్దాలకు పైగా ప్రజా జీవితంలో శాసనసభ్యుడు, శాసన మండలి సభ్యుడు, ఆర్థిక శాఖ మంత్రి, ముఖ్యమంత్రి, తమిళనాడు గవర్నర్‌గా పలు కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజల గౌరవాన్ని సంపాదించుకున్నారని కొనియాడారు. ఆర్థిక వ్యవహారాలపై రోశయ్యకు ఉన్న విశేష పట్టు, ప్రజాధనాన్ని అత్యంత బాధ్యతాయుతంగా వినియోగించాలనే ఆలోచన ఆయనను దేశంలోనే విశిష్ట నాయకుడిగా నిలబెట్టిందని మంత్రి పేర్కొన్నారు. రాజకీయ భేదాలకు అతీతంగా అన్ని పార్టీల నాయకుల గౌరవాన్ని పొందిన అరుదైన నాయకుడిగా రోశయ్య గుర్తింపు పొందారని చెప్పారు. క్లిష్ట పరిస్థితుల్లో ముఖ్యమంత్రిగా రాష్ట్ర పరిపాలనను సమర్థంగా నిర్వహించి ప్రజాస్వామ్య విలువలను కాపాడారని గుర్తుచేశారు.

# రోశయ్యకు శాసనసభలో ఘన నివాళులు



**హైదరాబాద్, జులై 4**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ దివంగత కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా తెలంగాణ శాసనసభ ప్రాంగణంలో ఘనంగా నివాళులర్పించారు. శాసనసభ మెంబర్స్ లాంజ్‌లో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్ పూలమా లలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రోశయ్య ప్రజా జీవితంలో అందించిన విశిష్ట సేవలను నాయకులు స్మరించు కున్నారు. రాజకీయాల్లో విలువలు, నిబద్ధత, నిజాయితీకి ప్రతీకగా నిలిచిన నాయకుడిగా ఆయనను కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం వివిధ హోదాల్లో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. శాసన సభ్యుడిగా, శాసనమండలి సభ్యుడిగా, ఆర్థిక శాఖ మంత్రిగా, ముఖ్యమంత్రిగా, అనంతరం తమిళనాడు గవర్నర్‌గా రోశయ్య సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించారని వక్తలు గుర్తు చేశారు. ముఖ్యంగా ఆర్థిక వ్యవహారాల నిర్వహణలో ఆయనకు ఉన్న అనుభవం, క్రమశిక్షణ దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకు ందని తెలిపారు. రోశయ్య రాజకీయ భేదాలకు అతీతంగా అన్ని వర్గాల నాయకుల గౌరవాన్ని సంపాదిం చుకు న్న అరుదైన నాయకుడని సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ హుందాత నం, సంయ మనంతో వ్యవహరించడం ఆయన ప్రత్యేకత అని అన్నారు.




# దిశ కమిటీ సమావేశంలో అభివృద్ధి పనుల సమీక్ష

**ఆదిలాబాద్, జులై 4 :**

ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం దిశ కమిటీ సమావేశం ఎంపీ గోడం నగేశ్ అధ్యక్షతన, జిల్లా కలెక్టర్ రాజర్షి షా సమక్షంలో నిర్వహిం చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం, ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనుల పురోగతిపై అధికారులు వివరాలు అందిం చారు. పనులు నాణ్యతతో పాటు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రజలకు ఉపాధి అవకాశాల మెరుగుపడేలా పథకాన్ని సమర్థవం తంగా అమలు చేయాలని అధికారులకు దిశాని ర్దేశం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు.

# దొడ్డి కొమురయ్యకు ఘన నివాళులు

**ఆదిలాబాద్, జులై 4**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతిని ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా దొడ్డి కొము




రయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించా రు. ఆయన త్యాగాలను స్మరిం చుకుంటూ ప్రజాస్వామ్య విలు వలు, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటాన్ని కొని యాడారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలు పాయల శంకర్, అనిల్ జాదవ్, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, బీసీ సంక్షేమ శాఖ అధికారి సోనియాతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రైతాంగ హక్కుల కోసం దొడ్డి కొమురయ్య చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

# పంట మార్పిడిపై ప్రత్యేక దృష్టి

**జనగామ, జులై 4**

రాష్ట్రంలో పంట మార్పిడి విధానాలను విస్తృతంగా అమలు చేయడంతో పాటు ఆ యిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. వర్షాకాలంలో కాలానుగుణ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. శనివారం హైద రాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన ఈ వీడియో కాన్ఫ రెన్స్‌లో జనగామ జిల్లా సమీకృత కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పాల్గొన్నారు. 2026--27 సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా 85 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని నిర్దేశించినట్లు సీఎస్ తెలిపారు. రైతులను పంట మార్పిడి విధానాల వైపు ప్రోత్సహించా లని, కూరగాయల సాగు, సూక్ష్మ సేద్య పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించేలా కార్యా చరణ రూపొందిం చాలని అధికారులను ఆదేశి ంచారు.



# రూ.97 లక్షల పనులకు శంకుస్థాపన

**హైదరాబాద్, జులై 4**

ఉప్పల్ నియోజకవర్గంలో తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు చేపట్టనున్న రూ.97 లక్షల విలువైన పలు అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. వెంకట్‌రెడ్డి నగర్, రామంతపూర్ డివిజన్ల పరిధిలో చేపట్టనున్న ఈ పనుల ద్వారా స్థానిక ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ నగర్‌లో రూ.8 లక్షల వ్యయంతో 100 మిల్లీమీటర్ల వ్యాసం కలిగిన తాగునీటి పైప్‌లైన్ పనులకు, బాలాజీ నగర్ – – శ్రీరామ కాలనీలో రూ.15 లక్షలతో 100 మిల్లీమీటర్ల వ్యాసం వాటర్‌లైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ పనులు పూర్తయితే ఆయా ప్రాంతాల్లో తాగునీటి సరఫరా మెరుగుపడుతుందని అధికారులు తెలిపారు.

# సెకండ్ హ్యాండ్ కార్ల పేరుతో రూ.1.58 కోట్ల మోసం

**హైదరాబాద్, జులై 4 :**



సెకండ్ హ్యాండ్ కార్ల వ్యాపా రంలో భారీ లాభాలు వస్తాయని నమ్మించి పలువురి నుంచి సుమా రు రూ.1.58 కోట్లు వసూలు చేసిన దంపతుల మోసం హైదరా బాద్‌లో వెలుగుచూసింది. కార్స్ 24 సంస్థ ప్రతినిధులమని నమ్మబ లికి పెట్టుబడులు సేకరించిన వాజిద్ అహ్మద్ ఖాన్, అతని భార్యపై హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీ సుల వివరాల ప్రకారం బాధితుడు రయీస్ అహ్మద్ ఫిర్యాదు మేరకు ఈ మోసం బయటపడింది. నింది తుడు వాజిద్ అహ్మద్ ఖాన్ తనకు వ్యక్తిగత పరిచయం ఉన్న వ్యక్తి కావడంతో అతను చెప్పిన మాటలను నమ్మినట్లు బాధితుడు



# హయత్‌నగర్‌లో కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

**హైదరాబాద్, జులై 4**

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హయత్‌నగర్ పరిధిలో విస్తృతంగా క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. చెత్త పేరుకుపోయే ప్రాంతాలు, దోమల ఉత్పత్తి కేంద్రాలు, నాలాల పూడికతీత పనులు, పార్కుల నిర్వహణను పరిశీలించి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఉదయం నుంచి పలు ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్ పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. చెత్త పేరుకుపోయే ప్రాంతాలను గుర్తించి వెంటనే శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా పారిశుధ్య నిర్వహణను మరింత సమ ర్థంగా చేపట్టాలని సూచించారు. వర్షాకాలంలో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్పష్టం చేశారు. దోమల ఉత్పత్తి కేంద్రాలను గుర్తించి వెంటనే నిర్మూలించాలని, క్రిమిసంహారక మందుల పిచికారీని ముమ్మరం చేయాలని ఆదేశించారు. అంటువ్యా ధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.



# బీఆర్ఎస్ నాయకుడిని పరామర్శించిన ఎమ్మెల్యే

**హైదరాబాద్, జులై 4**

రామంతాపూర్ డివిజన్‌లోని అరవింద్ నగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు లక్ష్మీనారాయణ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆయన నివాసానికి వెళ్లి పరామర్శిం చారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షించారు. శనివారం లక్ష్మీనారాయణ నివాసానికి చేరుకున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. వైద్యులు సూచించిన చికిత్సను క్రమం తప్పకుండా కొనసాగించాలని సూచిస్తూ, అవసరమైన వైద్య సేవలు అందేలా సంబంధిత అధికారులు, కుటుంబ సభ్యులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడు తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. ఎలాంటి అవసరం వచ్చినా తనను సంప్రదించాలని, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. లక్ష్మీనారాయణ త్వరగా కోలుకుని మళ్లీ ప్రజా సేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. లక్ష్మీనారాయణ ఆరోగ్యం గురించి తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కూడా ఆయనను పరామర్శించి ధైర్యం చెప్పారు.




# తెలంగాణ రాష్ట్రంను దేశంలోనే అగ్రగామిగా నిలపాలి :

**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**

**చిన్న జిల్లాల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చు**

**ఆరు నెలల్లో రాష్ట్రంలో గణనీయమైన మార్పు తీసుకురావాలి**

**రైతులకు తెలుగు భాషలో వ్యవసాయ సూచనలు పంపాలి**

**మధ్యాహ్న భోజనం, అల్పాహార పథకాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**

**వ్యవసాయం, తాగునీరు, ఆరోగ్యం, సాగునీరు, విద్య, వాతావరణ పరిస్థితులపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎస్**

సూర్యాపేట జూలై 5

రాష్ట్ర, జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి జిల్లాకు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటి సాధన దిశగా కార్యాచరణ చేపట్టి తెలంగాణ రాష్ట్రంను దేశంలోనే అగ్రగామిగా నిలపాలనీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లకు సూచించారు. వ్యవసాయం, తాగునీరు, ఆరోగ్యం, సాగునీరు, విద్య, వాతావరణ పరిస్థితులపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సూర్యాపేట సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐ.డీ.ఓ.సీ) నుంచి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లిరాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ,లి చిన్న జిల్లాలు ఉ ండడం వల్ల పరిపాలన మరింత సమర్థవంతంగా సాగుతుందని, చిన్న సమస్యలు కూడా అధికారుల దృష్టికి వస్తాయని తెలిపారు. చిన్న జిల్లాల్లో ఐ.ఏ.ఎస్. అధికారులు అద్భుత ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి శాఖకు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. ప్రతి జిల్లా రాష్ట్ర, జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా తనదైన అజెండాతో ముందుకు సాగాలని అన్నారు. సమష్టి కృషితో వచ్చే ఆరు నెలల్లో రాష్ట్రంలో గణనీయమైన మార్పు తీసుకురావచ్చని తెలిపారు. జిల్లాల్లో ఎదురయ్యే ఏ సమస్యనైనా ఎప్పుడైనా రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. వర్షపాతం పరిస్థితులను సమీక్షిస్తూ కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఇప్పటివరకు సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. రాష్ట్రంలో రెండు జిల్లాల్లో అధిక వర్షపాతం, 19 జిల్లాల్లో సాధారణ వర్షపాతం, 11 జిల్లాల్లో లోటు వర్షపాతం, ఒక జిల్లాలో అత్యల్ప వర్షపాతం నమోదైందన్నారు. రాష్ట్రంలో సుమారు 70 లక్షల మంది రైతులకు రైతు భరోసా అందుతున్న నేపథ్యంలో రైతుల మొబైల్ నంబర్లు ప్రభుత్వానికి అందుబాటులో ఉన్నాయని, ప్రతి రైతుకు తెలుగు భాషలో వ్యవసాయ సూచనలు, వర్షపాతం వివరాలు, వాతావరణ హెచ్చరికలు ఎస్.ఎం.ఎస్.ల ద్వారా నిరంతరం పంపించాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన యూరియా నిల్వలు రాష్ట్రంలో తగినంతగా ఉన్నాయని, ప్రతి రైతుకు అవసరమైన సమయంలో అవసరమైన పరిమాణంలో యూరియా అందేలా చూడాలని సూచించారు. యూరియా వృథా కాకుండా, అవసరానికి మించి వినియోగించకుండా రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రత్యామ్నాయ పంటలు, ఉద్యాన పంటలు, ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగును పెద్దఎత్తున ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వం బోనస్ అందిస్తున్న ఏడు రకాల సన్న వరి వంగడాల పై రైతులకు స్పష్టమైన సమాచారం చేరేలా చూడాలని, ఆయా వంగడాల విత్తనాలు ప్రతి మండలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వరి సాగు విస్తీర్ణాన్ని ప్రణాళికాబద్ధంగా తగ్గిస్తూ కూరగాయల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. పట్టణాలు, నగరాలకు సమీపంలోని రైతులు కూరగాయల సాగు చేపట్టేలా ప్రోత్సహించడం ద్వారా ప్రజలకు నాణ్యమైన కూరగాయలు అందడంతో పాటు రైతుల ఆదాయం కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు జిల్లా స్థాయిలో పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలతో వెంటనే సమీక్ష సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. యాంటీ లార్వా కార్యక్రమాలను పెద్దఎత్తున చేపట్టాలని, ప్రతి శుక్రవారం అన్ని గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల్లో డ్రై డే కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. గురుకులాలు, హాస్టళ్లలో పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, జిల్లాల్లో ప్రతిరోజూ సీజనల్ వ్యాధుల నివేదికలను సమీక్షిస్తూ అవసరమైన మందులు సిద్ధంగా ఉ ంచాలని తెలిపారు. ప్రసవానికి సిద్ధంగా ఉన్న గర్భిణుల జాబితాను ముందుగానే సిద్ధం చేయాలని, వారిని ఆరోగ్య సిబ్బంది నిరంతరం ఫాలో అప్ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి సరఫరాకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలిపారు. గోదావరి, కృష్ణా ప్రాజెక్టుల నుంచి పట్టణాలు, నగరాలు, గ్రామాలకు బల్క్ తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థలు సమన్వయంతో ప్రతి ఇంటికి నీరు అందేలా చర్యలు తీసుకోవాలని, పైప్ లైన్ లీకేజీ లను వెంటనే నివారించాలని, నీటి వృథాను అరికట్టాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో నీరు అత్యంత విలువైనదని, ప్రాజెక్టుల్లో కనీస నీటి మట్టం కొనసాగించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయం మేరకు జూలై 1 నుంచి అమలులోకి వచ్చిన లిలివీ.బీ.జీ.ఆర్.ఏఎం.జీ. (ఎదీ+=ూవీ+)లిలి పథకాన్ని అన్ని జిల్లాల్లో సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో చేపట్టే తాగునీటి పనులకు ఈ పథకంలో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యాశాఖలో మధ్యాహ్న భోజన పథకం, అల్పాహార పథకాలను నాణ్యతతో అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. ఈ కార్యక్రమంపై మంత్రివర్గం సమగ్ర సమీక్ష నిర్వహించిం దని, ప్రస్తుతం ఉపాధ్యాయులు, సిబ్బంది కూడా మధ్యాహ్న భోజనం, అల్పాహార పథకాలలో భాగమయ్యారని తెలిపారు. ప్రతిరోజూ మధ్యాహ్న భోజనం, అల్పాహారం తీసుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని, దీంతో నాణ్యత నియంత్రణ మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి హరి సింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, జెడ్పి సీఈవో శిరీష, డిఆర్డిఓ సన్యాసయ్య, డిఎంహెచ్ఓ వెంకటరమణ, డిపిఓ యాదగిరి సంబంధిత శాఖల జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమరయ్య ఆశయ సాధనకై అంకితమవుదాం

**బీసీ హక్కుల సాధన సమితి పిల్లుట్ల కనకయ్య**



తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య ఆశయ సాధనకై అంకిత మావదామని బీసీ హక్కుల సాధన సమితి సూర్యాపేట జిల్లా కార్యదర్శి పిల్లుట్ల కనకయ్య అన్నారు శనివారం నాడు సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రంలో దొడ్డి కొమరయ్య 80 వర్ధంతి కార్యక్రమాలలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ..... తెలంగాణ సాయుధ పోరాటంలో తన ప్రాణాలు అర్పించిన తొలి అమరజీవి దొడ్డి కొమురయ్య అని ఆయన మరణం తెలంగాణ సాయుధ పోరాటానికి స్ఫూర్తి నిచ్చిందని ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన నిజాం నవాబ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ను గద్దె దించేందుకు నాలుగు వేల మంది నవ యువ కిశోరాలు ఆత్మ బలిదానంతో తెలంగాణకు విముక్తి జరిగి భారతదేశంలో విలీనం అయ్యిందని ఈనాడు మనమంత భారతీయుల మని సగర్వంగా చెప్పు చెప్పుకున్నామంటే అది సిపిఐ పార్టీ చేసిన అసమాన త్యాగాల పునాది అని ఆ మహనీయుడు త్యాగాల్ని గ్రామ గ్రామాన వివరించి నేడు పాలకులు అవలంబిస్తున్న తిరోగమన విధానాలను నేటి యువతరానికి వివరించి వారిని చైతన్యపరచి, మతోన్మాదుల కబంధ హస్తాల నుంచి భరతమాతను విముక్తి చేయాలని ఆయన కోరారు నాటి స్వాతంత్ర పోరాటంలోనూ ఆ తర్వాత జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలోనూ అలాగే ఇటీవల జరిగిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ అశువులు బాసిన వారిలో బీసీలే ప్రథమ స్థానంలో ఉన్నారని త్యాగాలకు ప్రతీకైన బీసీలకు మాత్రం పాలకులు అభివృద్ధిలో తగువాటా ఇవ్వడం లేదని రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా బీసీల వెనకబాటు తనానికి పాలకులు అనుసరిస్తున్న విధానాలే కారణమని అందువల్ల బీసీలు చైతన్యమై న్యాయమైన హక్కుల కోసం బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో జరిగే పోరాటాల్లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో రిటైర్డ్ కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకులు పుట్టపాక అంజయ్య బీసీ హక్కుల సాధన సమితి గౌరవాఉ పాధ్యక్షులు సిరాపురపు శ్రీనివాసరావు , సిపిఐ కార్యదర్శి చిలివేరు ఆంజనేయులు, మాజీ వార్డు సభ్యులు నారాయణ, తాడేపల్లి తిరుమల రావు, కొరట్ల సోమయ్య , దొడ్డ శీను , ఈగ శ్రీను , పాల్గొనడం జరిగింది.

# నారాయణపురం లో రూ. 20 లక్షల నిధులతో పల్లె దవఖాన ప్రారంభం

చిలుకూరు,



చిలుకూరు మండలంలోని నారాయణపురం నేషనల్ హెల్త్ మిషన్ రూ. 20 లక్షల నిధులతో నిర్మించిన పల్లె దవఖానాను కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి శనివారం ప్రారంభించారు, గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు దవాఖానాలు నిర్మిస్తున్నట్లు ఆమె తెలిపారు , గ్రామ అంతర్గత రోడ్ల అభివృద్ధి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు, ఈ కార్యక్రమంలో, సర్పంచ్ మండవ జయమ్మ, వెంకటేశ్వర్లు, వైద్యాధికారి సుభాష్ ఏ ఎన్ ఎం నాగలక్ష్మి ఆశా కార్యకర్తలు సుశీల నాగమణి తదితరులు పాల్గొన్నారు,



# జూలై 7న ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

లిచిలుకూరు మండలం నారాయపురం గ్రామంలో శనివారం వీ=ూ మండల అధ్యక్షులు మల్లేపంగు సూరిబా బు మాదిగ ఆధ్వర్యంలో గో టు విలేజ్ కార్యక్రమం మరియు చిలుకూరు మండలంలోని 11 గ్రామాలమాదిగ పల్లెల్లో ఎమ్మార్పీఎస్ 32 వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునివ్వడం జరిగింది, ఈ కార్యక్రమనికి అతిథులుగా చిలుకూరు మండల ఇన్చార్జి ఎం ఎస్ పి రాష్ట్ర నాయకులు కొండపల్లి ఆంజనేయులు మాదిగ, ఎం ఎస్ పి జిల్లా ఉపాధ్యక్షులు సిద్దెల శ్రీను మాదిగలు పాల్గొని మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో సాధిం చుకున్న ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఫలాలను గ్రామాలలో వున్న మాదిగ విద్యార్థులు, నిరుద్యోగులు ఉపయోగించుకొని ఉద్యోగాలు సాధించేలా చైతన్య పరచడం కోసం ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు.జాతి ఆత్మ గౌరవ పతాకమైన ఎమ్మార్పీఎస్ దిమ్మెలను ప్రతి గ్రామంలో నిర్మాణం చేసుకొని జూలై 7న తేదీన జరిగే ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గ్రామాలలో పెద్ద ఎత్తున పండగ వాతావరణం లో చేప ట్టాలని అన్నారు. ప్రతి గ్రామాలలో జాతిని సంఘటితం చే స్తూ ప్రచారాలలో పాల్గొని పద్మశ్రీ మందకృష్ణ మాది గ నాయకత్వంలో మాదిగ జాతిని అభి వృద్ధి పథంలో నడిపించే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ఎతీజూం మండల ఉపాధ్యక్షుడు కందుకూరి శ్రీను మాదిగ, చిన్నపంగు కుటుంబరావు, గుండెపంగు రాములు, కందుకూరి భాస్కర్, బొల్లిపంగు క్రాంతి కుమార్, చిన్నపంగు నాగరాజు, కందుకూరి వెంకటయ్య, మీసాల శ్రీను బొల్లిపంగు వెంకటి, మరియు తదితరులు పాల్గొన్నారు..

# ఎన్‌డీఎస్‌ఏ, సీడబ్ల్యూసీ అనుమతి తర్వాతే కాళేశ్వరం బ్యారేజీల నిర్వహణ:

**ఉత్తమ్ కుమార్ రెడ్డి**

నాగార్జునసాగర్, జూలై 4 ):

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను అన్ని పునరుద్ధరణ పనులు పూర్తై, జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (చీణూా) మరియు కేంద్ర జల సంఘం (జఔజ) స్వతంత్రంగా ఆమోదించిన తర్వాతే తిరిగి నిర్వహణలోకి తీసుకువస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం నాగార్జునసాగర్ డ్యాం సమీపంలోని విజయ్ విహార్‌లో ప్రాజెక్టు సీనియర్ ఇంజినీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించిన అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి రాజకీయ ప్రయోజనాల కంటే సాగునీటి ప్రాజెక్టుల భద్రత, స్థిరత్వం, ప్రజల ఆస్తుల పరిరక్షణకే అత్యధిక ప్రాధాన్యం ఉందని తెలిపారు. అవసరమైన అన్ని మరమ్మతులు, పునరుద్ధరణ పనులు పూర్తయ్యే వరకు బ్యారేజీలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్వహించబోమని ఆయన స్పష్టం చేశారు. పునరుద్ధరణ ప్రణాళికను ఎన్‌డీఎస్‌ఏ, సీడబ్ల్యూసీలు క్షుణ్ణంగా పరిశీలించి ఆమోదించిన తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణానికి రూ.1.10 లక్షల కోట్లకు పైగా ప్రజాధనం వెచ్చించబడిందని, ఆ పెట్టుబడిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తగిన మరమ్మతులు పూర్తికాకముందే బ్యారేజీలను నిర్వహించడం వల్ల తీవ్ర పరిణామాలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. అలా చేస్తే సుమారు 40 గ్రామాలతో పాటు భద్రాచలం పట్టణం, ప్రసిద్ధ శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంతానికీ ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. బ్యారేజీల పునరుద్ధరణ కోసం ప్రభుత్వం పూర్తిగా శాస్త్రీయ విధానాన్ని అనుసరిస్తోందని మంత్రి తెలిపారు. నిర్మాణాల స్థితిని అంచనా వేసేందుకు తాజా జియోటెక్నికల్ పరిశోధనలు, నాన్-డిస్ట్రక్టివ్ పరీక్షలు, గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ సర్వేలు, డ్రోన్ ఆధారిత అధ్యయనాలు, 100కు పైగా బోర్‌హోల్స్ ద్వారా పరిశీలనలు చేపట్టినట్లు వెల్లడించారు ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు ప్రస్తుతం అన్ని గేట్లను తెరిచి ఉంచి బ్యారేజీలపై నీటి భారం లేకుండా నిర్వహిస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ నిపుణులు, సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ కేంద్ర జల సంఘం సంయుక్తంగా పునరుద్ధరణ



# తొలి అమరుడు దొడ్డి కొమురయ్య ఆశయాలు నేటి తరానికి ఆదర్శం:

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

సూర్యాపేట జూలై 5



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య త్యాగం, ధైర్యసాహసాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. దొడ్డి కొమురయ్య వర్ధంతిని పురస్కరించుకుని శనివారం జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెట్టిచాకిరీ, సామాజిక దోపిడీ, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రాణాల ను సైతం లెక్కచేయకుండా పోరాడిన దొడ్డి కొముర య్య తెలంగాణ ప్రజల స్వాభిమానానికి ప్రతీకగా నిలిచారని పేర్కొ న్నారు. సమాజంలో సమానత్వం, న్యాయం, ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన త్యాగాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

తెలంగాణ చరిత్రలో రైతాంగ సాయుధ పోరాటానికి దొడ్డి కొమురయ్య చేసిన త్యాగం చిరస్థాయిగా నిలిచిపోతుందని, మహనీయుల ఆశయాలను భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరి సింగ్,జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్ రాజ్, బీసీ వెల్ఫేర్ అధికారి విశాల్ ఉప్పల రమేష్ గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కార్యదర్శి, కంచకట్ల శ్రీనివాస్, సహాయ కార్యదర్శి, మన్యం యాదగిరి, దున్న శ్యామ్, జిల్లా కార్యదర్శి టీఎన్జీవోస్ యూనియన్,స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# ఐదు రోజుల్లో 67.45 లక్షల మంది రైతులకు రూ.7,135 కోట్ల రైతు భరోసా

హైదరాబాద్, జూలై 4

రైతులకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత-జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపా రు. రైతు భరోసా నిధులను రికార్డు స్థాయిలో రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని పేర్కొన్నా రు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో మంత్రి మాట్లాడుతూ, జూన్ 30న రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమాన్ని ప్రారం భించినప్పటి నుంచి కేవలం ఐదు రోజు ల్లోనే రాష్ట్రంలోని 67.45 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.7,135.77 కోట్లు నేరుగా జమ చేసినట్లు వెల్లడించారు. ఇది రైతు సంక్షేమం లో మరో రికార్డుగా నిలిచిందని అన్నా రు. రైతు భరోసా పథకం ఐదో విడత కింద 5 నుంచి 6 ఎకరాల సాగుభూమి కలిగిన 1.69 లక్షల మంది రైతులకు రూ.545.41 కోట్లు నేరు గా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు మంత్రి తెలిపారు. అర్హులైన ప్రతి రైతుకు దశలవా రీగా రైతు భరోసా ఆర్థిక సాయాన్ని పారదర్శ కంగా అంది స్తున్నామని, రైతుల సంక్షేమ మే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# గృహ నిర్మాణం, మౌలిక వసతుల పనులు వేగవంతం చేయాలి:

**అధికారులకు పొంగులేటి ఆదేశం**

హైదరాబాద్, జూలై 4

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గృహ నిర్మాణ, మౌలిక వసతుల ప్రాజెక్టుల అమలును వేగవంతం చేయాలని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం సచివాల యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. పట్టణ ప్రాంతాల్లో తక్కువ ఆదాయ వర్గాల (ఎల్ఐజీ) కోసం చేపడుతున్న క్యార్ పథకం కింద గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. తొలి దశలో రాష్ట్రంలోని 26 అసెంబ్లీ నియోజ ంకవర్గాల్లో ఒక్కో నియోజక˘వర్గంలో 500 ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన భూసేకరణ, టెండర్ల ప్రక్రియలను రెవెన్యూ, గృహనిర్మాణ శాఖలు పరస్పర సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా శాశ్వత ప్రభుత్వ భవనాల నిర్మాణ పురోగతిని కూడా మంత్రి సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా 107 తహసీల్దార్ కార్యాలయాలు, రెండు డీఐజీ కార్యాలయాలు, నాలుగు జిల్లా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు, 52 సబ్-రిజిస్ట్రార్ కార్యాల యాల నిర్మాణ పనులపై అధికారులతో చర్చించా రు. అన్ని ప్రభుత్వ భవనాలను ఒకే నమూనాలో, ఆధునిక ప్రజా సౌకర్యాలతో నిర్మించాలని మంత్రి స్పష్టం చేశారు. అలాగే ఇంధన పొదుపు, పునరుత్పాదక శక్తి వినియోగాన్ని ప్రోత్సహించేలా సౌరశక్తి ఆధారిత పార్కింగ్ సదుపాయాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావే శంలో గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్, స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తదితర అధికారులు పాల్గొన్నారు.

# యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సుబేదారి హన్మకొండ



( మనదీపం జూలై 4 )

రాజ్యాధికార సమరభేరి సభకు యూనివర్సిటీ అధ్యాపకుల మద్దతు ఈనెల భువనగిరిలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ చేపట్టిన రాజ్యాధికార సమరభేరి సభకు యూనివర్సిటీ బీసీ అధ్యాపకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డా. తిరునహరి శేషు ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళా శాలలో జరిగిన బీసీ అధ్యాపకుల సమావేశంలో బీసీ అధ్యాపకులు పాల్గొని సమరభేరి సభకు తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. బీసీ ఎస్సీ ఎస్టీ వర్గాలు బాధ్యతగా ఈ సభకు తమ మద్దతు ప్రకటించాలని వక్తలు అభిప్రాయపడ్డారు. సమైక్య ఆంధ్రప్రదేశ్ లో కానీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కానీ రాజ్యాధికారంలో బీసీలకు న్యాయంగా దక్కాల్సిన వాటా దక్కటం లేదు అలాగే రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిపాదించే బడ్జెట్ లో కూడా బీసీలకి న్యాయమైన వాటా కూడా దక్కటం లేదు కాబట్టి బీసీలు చట్టబద్ధంగా తమ న్యాయమైన హక్కుల సాధన కోసం రాజకీయంగా ఒత్తిడి వర్గాలుగా ఎదగటం తోటే సాధ్యమవుతుందని బీసీ అధ్యాపకులు అభిప్రాయపడి నారు. ఎన్నికలకు ముందు అధికారంలోకి రావడానికి రాజకీయ పార్టీలు వెనుకబడిన వర్గాలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత బలహీనవర్గాలను పట్టించుకోవటం లేదని విమర్శించారు . ఈ కార్యక్రమంలో బీసీ రైటర్స్ వింగ్ రాష్ట్ర చైర్మన్ డా. చింతం ప్రవీణ్ కుమార్, కాకతీయ విశ్వవిద్యాలయం బీసీ టీచర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ డా. ఎర్రబొజ్జు రమేష్,మాథ్స్ విభాగం హెడ్ డా. నాగయ్య,డా. సదానందం రాజనీతి శాస్త్రం విభా గం ఇన్ చార్జ్ హెడ్,డా. విజయ్ కుమార్,డా. రచ్చ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

# కొమురయ్య ఆశయ సాధనే భువనగిరి సభ లక్ష్యం: వట్టే జానయ్య యాదవ్

భువనగిరి, జూలై 4

వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య భావి విప్లవాలకు మార్గదర్శకుడని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ అన్నారు. భువనగిరిలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, కడవెండి గ్రామంలో జరిగిన పోలీసు కాల్పుల్లో దొడ్డి కొమురయ్య అమరుడయ్యారని గుర్తు చేశారు. ఆయన అమరత్వం అనంతరం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం కొత్త మలుపు తిరిగిందని, గ్రామాలు ఉద్యమ జ్వాలతో అట్టుడికి పోయాయని పేర్కొన్నారు. కొమురయ్య మరణం తర్వాత ప్రతి గ్రామంలో ఆయన త్యాగాన్ని స్మరిస్తూ పాటలు, ఊరేగింపులు నిర్వహించారని తెలిపారు. ఆయన త్యాగం నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన 78 సంవత్సరాలు గడిచినా అట్టడుగు వర్గాలకు బానిస సంకెళ్లు పూర్తిగా తెగిపోలేదని జానయ్య యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ అంటరానితనం, బడుగు బలహీన వర్గాలను రాజకీయాలకు దూరంగా ఉంచడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. దొడ్డి కొమురయ్య కలగన్న భూమి, భుక్తి, విముక్తి లక్ష్యాలు ఇప్పటికీ పూర్తిగా నెరవేరలేదని అన్నారు. ఈ నేపథ్యంలో భువనగిరిలో నిర్వహించనున్న రాజ్యాధికార సభ దొడ్డి కొమురయ్య అమరత్వానికి ప్రతీకగా నిలుస్తుందని, ఆయన ఆశయాలను ప్రజల్లో మరింత బలంగా చాటిచెప్పే వేదికగా మారుతుందని పేర్కొన్నారు. కొమురయ్య త్యాగాలను గౌరవించే ప్రతి ఒక్కరూ రేపు జరిగే సభకు హాజరై విజయవంతం చేయాలని వట్టే జానయ్య యాదవ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజ అక్క, మహిళ వర్కింగ్ ప్రెసిడెంట్ నీరజ గౌడ్, కార్యదర్శి కొమ్ముల ప్రవీణ్ కుమార్,కోట్ల వాసు దేవ్, మీనా, శాలిని సౌభాగ్య, వెంకటేశ్వర్లు, బిక్షపతి,నగేష్, తదితరులు పాల్గొన్నారు

# అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి - జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**ఉపాధి హామీ పనిదినాలు 125కు పెంపు**

**తక్కువ వర్షపాతం నేపథ్యంలో ఆరుతడి పంటలే మేలు**

**అధికారులతో వెబ్ ఎక్స్ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**




సూర్యాపేట జూలై 5

జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ నుంచి ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీరాజ్ ఏఈలు, ఏపీఎంలతో కలెక్టర్ వెబ్ ఎక్స్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లోని ముఖ్య అంశాలను అధికారులకు వివరించారు. ఈ వానాకాలంలో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున, రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటలు వేసుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయం, త్రాగునీరు, విద్య, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి అంశాల్లో నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. వీబీజీ రాంజీ పథకం కింద ఉపాధి హామీ పనిదినాలను 125 రోజులకు పెంచినట్లు కలెక్టర్ తెలిపారు. పెంచిన పనిదినాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, పాఠశాలల్లో టాయిలెట్ల నిర్వహణ, ఇంకుడు గుంటల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పొదుపు సంఘాల రుణాల బకాయిలను సకాలంలో వసూలు చేయాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో అడిషనల్ కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్డీఓ పీడీ సన్యాసయ్య, జెడ్పీ సీఈవో శిరీష, డిపిఓ యాదగిరి, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, డీఈఓ అశోక్, డీఎంహెచ్ఓ వెంకటరమణ, మిషన్ భగీరథ ఈఈ అరుణాకర్ రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు రవితేజ, అనూష తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాజ్యాధికార సమరభేరి సభకు మందకృష్ణ మాదిగకు ఆహ్వానం

మనదీపం జూలై 4

ప్రత్యేకంగా ఆహ్వానించిన స్టేట్ సెక్రెటరీ, ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ఇన్చార్జి కొమ్ముల ప్రవీణ్ రాజ్ హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా 'తెలంగాణ రాజ్యాధికార పార్టీ' ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "రాజ్యాధికార సమరభేరి" సభకు రావాల్సిందిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు శ్రీ మందకృష్ణ మాదిగ గారిని పార్టీ తరపున సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ స్టేట్ సెక్రెటరీ మరియు ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ఇన్చార్జి కొమ్ముల ప్రవీణ్ రాజ్ స్వయంగా మందకృష్ణ మాదిగ గారి నివాసానికి వెళ్ళారు. ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి, సభకు రావాల్సిందిగా ప్రత్యేకంగా ఆహ్వానించి, ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ... "తెలంగాణలో బడుగు, బలహీన వర్గాలు రాజ్యాధికారం దిశగా



అడుగులు వేయడం ఆహ్వానించదగ్గ పరిణామం. రాజ్యాధికార సమరభేరి సభ విజయ వంతం కావాలని, ఈ సభ ద్వారా బీసీల గొంతుక మరింత బలం గా వినిపించాలని ఆకాంక్షిస్తున్నాను.,"అని మందకృష్ణ మాదిగ గారు పేర్కొన్నారు. అనంతరం కొమ్ముల ప్రవీణ్ రాజ్ మాట్లాడు తూ... "రాష్ట్రంలో సామాజిక మార్పు కోసం మేం చేస్తున్న పోరాటా నికి శ్రీ మంద కృష్ణ మాదిగ గారి వంటి అగ్రనేతల మద్దతు మాకు ఎంతో స్ఫూర్తినిస్తుంది. .రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల ఆకాంక్షల ను నెరవేర్చే దిశగా 'రాజ్యాధికార సమరభేరి' ఒక మైలురాయిగా నిలుస్తుంది," అని కొమ్ముల ప్రవీణ్ రాజ్ తెలిపారు.



## గుండె సమస్యల పరిష్కారంలో మరో ముందడుగు

**యశోదలో అత్యాధునిక పీఎఫ్ఏ చికిత్స**

**రెండు క్లిష్ట కేసుల్లో విజయవంతంగా గుండె స్పందన పునరుద్ధరణ**

హైదరాబాద్, జూలై 4

గుండె స్పందనలో ఏర్పడే క్లిష్టమైన రిథమ్ (కార్డియాక్ అరిత్మియా) సమస్యల చికిత్స కోసం అత్యాధునిక పల్స్ ఫీల్డ్ అబ్లేషన్ (ౄబశ్రీంవ ఖీఱవశ్రీన-ూఎశ్రీ్ఱశీఅ -ౄఖీూ) సాంకేతికతను సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రి అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ విధానంతో 31 ఏళ్ల యువకుడు, 84 ఏళ్ల వృద్ధుడికి విజయవంతంగా చికిత్స నిర్వహించి సాధారణ గుండె స్పందనను పునరుద్ధరించినట్లు ఆస్పత్రి వెల్లడించింది. మెడ్ట్రానిక్ సంస్థ అభివృద్ధి చేసిన పల్స్ సెలెక్ట్ పీఎఫ్ఏ వ్యవస్థ ద్వారా వేడి లేదా తీవ్రమైన చలిని ఉపయోగించకుండా, నియంత్రిత విద్యుత్ తరంగాల సహాయంతో గుండెలో అసాధారణంగా పనిచేస్తున్న కణజాలాన్ని లక్ష్యంగా చేసుకుని చికిత్స అందిస్తారు. దీంతో చుట్టుపక్కల ఉన్న కీలక అవయవాలకు హాని కలిగే ప్రమాదం తగ్గడంతో పాటు రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని వైద్యులు తెలిపారు. 31 ఏళ్ల రోగి ప్యారాక్సిజ్మల్ ఎట్రియల్ ఫిబ్రిలేషన్ మరియు లెఫ్ట్ ఎట్రియల్ టాకీకార్డియా సమస్యలతో బాధపడుతుండగా, పీఎఫ్ఏ చికిత్స అనంతరం అతని గుండె స్పందన పూర్తిగా సాధారణ స్థితికి చేరుకుంది. అలాగే నిరంతర ఎట్రియల్ ఫిబ్రిలేషన్ సమస్యతో బాధపడుతున్న 84 ఏళ్ల వృద్ధుడికి కూడా ఇదే విధానంలో చికిత్స నిర్వహించి, గుండె స్పందనను సాధారణ స్థితికి తీసుకువచ్చిన అనంతరం ఆరోగ్యంగా డిశ్చార్జ్ చేసినట్లు ఆస్పత్రి తెలిపింది. ఈ చికిత్సలను యశోద ఆస్పత్రి సీనియర్ కార్డియాక్ ఎలక్ట్రోఫిజియాలజిస్టు, హార్ట్ ఫెయిల్యూర్ నిపుణుడు డాక్టర్ ఎం.ఎస్. చంద్రమౌళి నేతృత్వంలోని ఎలక్ట్రోఫిజియాలజీ బృందం నిర్వహించింది. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రమౌళి మాట్లాడుతూ, "పల్స్ ఫీల్డ్ అబ్లేషన్ గుండె రిథమ్ సమస్యల చికిత్సలో కీలక ముందడుగు. ఇది మరింత ఖచ్చితత్వం, అధిక భద్రత, వేగవంతమైన కోలుకునే అవకాశాలను రోగులకు అందిస్తుంది" అని పేర్కొన్నారు. పీఎఫ్ఏ సాంకేతికత అందుబాటులోకి రావడంతో యశోద ఆస్పత్రి అత్యాధునిక గుండె వైద్య సేవలను మరింత విస్తరించి, క్లిష్ట గుండె రిథమ్ సమస్యలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన తాజా చికిత్సను రోగులకు అందిస్తున్నట్లు ఆస్పత్రి వెల్లడించింది.



## కొమురయ్య ఆశయ సాధనే భువనగిరి సభ లక్ష్యం:

**వట్టే జానయ్య యాదవ్**

వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య భావి విప్లవాలకు మార్గదర్శకుడని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ అన్నారు. భువనగిరిలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, కడవెండి గ్రామంలో జరిగిన పోలీసు కాల్పుల్లో దొడ్డి కొమురయ్య అమరుడయ్యారని గుర్తు చేశారు. ఆయన అమరత్వం అనంతరం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం కొత్త మలుపు తిరిగిందని, గ్రామాలు ఉద్యమ జ్వాలతో అట్టుడికిపోయాయని పేర్కొన్నారు. కొమురయ్య మరణం తర్వాత ప్రతి గ్రామంలో ఆయన త్యాగాన్ని స్మరిస్తూ పాటలు, ఊరేగింపులు నిర్వహించారని తెలిపారు. ఆయన త్యాగం నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన 78 సంవత్సరాలు గడిచినా అట్టడుగు వర్గాలకు బానిస సంకెళ్లు పూర్తిగా తెగిపోలేదని జానయ్య యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ అంటరానితనం, బడుగు బలహీన వర్గాలను రాజకీయాలకు దూరంగా ఉంచడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. దొడ్డి కొమురయ్య కలగన్న భూమి, భుక్తి, విముక్తి లక్ష్యాలు ఇప్పటికీ పూర్తిగా నెరవేరలేదని అన్నారు. ఈ నేపథ్యంలో భువనగిరిలో నిర్వహించనున్న రాజ్యాధికార సభ దొడ్డి కొమురయ్య అమరత్వానికి ప్రతీకగా నిలుస్తుందని, ఆయన ఆశయాలను ప్రజల్లో మరింత బలంగా చాటిచెప్పే వేదికగా మారుతుం దని పేర్కొన్నారు. కొమురయ్య త్యాగాలను గౌరవించే ప్రతి ఒక్కరూ రేపు జరిగే సభకు హాజరై విజయవంతం చేయాలని వట్టే జానయ్య యాదవ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజ అక్క, మహిళ వర్కింగ్ ప్రెసిడెంట్ నీరజ గౌడ్, కార్యదర్శి కొమ్ముల ప్రవీణ్ కుమార్,కోట్ల వాసు దేవ్, మీనా, శాలిని సౌభాగ్య, వెంకటేశ్వర్లు, బిక్షపతి,నగేష్, తదితరులు పాల్గొన్నారు





# కేప్ వెర్డే పోరాటం.. అర్జెంటీనాకు చెమటలు

**మ్యాచ్ ఆరంభం నుంచే ఇరు జట్లు దూకుడుగా ఆడాయి. అర్జెంటీనా ఆధిపత్యం చెలాయించేందుకు ప్రయత్నించగా, కేప్ వెర్డే కట్టుదిట్టమైన రక్షణతో పాటు వేగవంతమైన ఎదురుదాడులతో ఆకట్టుకుంది. నిర్ణీత 90 నిమిషాల ఆట ముగిసే సమయానికి ఇరు జట్లు చెరో గోల్ నమోదు చేయడంతో స్కోరు 1--1తో సమమైంది. దీంతో మ్యాచ్ అదనపు సమయానికి వెళ్లింది.**

ఫిఫా ప్రపంచకప్--2026 నాకౌట్ దశలో అర్జెంటీనా, కేప్ వెర్డే మధ్య జరిగిన పోరు అభిమానులను ఉర్రూతలూగించింది. ప్రపంచ ఛాంపియన్ అర్జెంటీనాను చిన్న ద్వీప దేశమైన కేప్ వెర్డే చివరి వరకు గట్టిగా నిలువరించినా అదనపు సమయంలో 3--2 తేడాతో ఓటమి పాలైంది. ఓడిపోయినప్పటికీ కేప్ వెర్డే ప్రదర్శన ఫుట్‌బాల్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది.

మ్యాచ్ ఆరంభం నుంచే ఇరు జట్లు దూకుడుగా ఆడాయి. అర్జెంటీనా ఆధిపత్యం చెలాయించేందుకు ప్రయత్నించగా, కేప్ వెర్డే కట్టుదిట్టమైన రక్షణతో పాటు వేగవంతమైన ఎదురుదాడులతో ఆకట్టుకుంది. నిర్ణీత 90 నిమిషాల ఆట ముగిసే సమయానికి ఇరు జట్లు చెరో గోల్ నమోదు చేయడంతో స్కోరు 1--1తో సమమైంది. దీంతో మ్యాచ్ అదనపు సమయానికి వెళ్లింది. అదనపు సమయం ప్రారంభంలోనే అర్జెంటీనా మరో గోల్ చేసి 2--1తో ఆధిక్యంలోకి వెళ్లింది. మ్యాచ్ తమ చేతిలోనే ఉందని భావించిన సమయంలో కేప్ వెర్డే మిడ్‌ఫీల్డర్ సిడ్నీ లోప్స్ కాబ్రల్ అద్భుత గోల్‌తో అందరినీ ఆశ్చర్యపరిచాడు. పెనాల్టీ ప్రాంతం అంచు నుంచి అతడు కొట్టిన శక్తివంతమైన షాట్ నేరుగా గోల్‌పోస్ట్ పై మూలలోకి దూసుకెళ్లడంతో స్కోరు 2--2తో సమమైంది. ఈ గోల్ టోర్నీలోనే అత్యుత్తమ గోల్స్‌లో ఒకటిగా నిలిచే అవకాశముందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే మ్యాచ్ ముగియడానికి కొద్దిసేపటి ముందు అర్జెంటీనా మరోసారి తన అనుభవాన్ని చాటుకుంది. కేప్ వెర్డే రక్షణను ఛేదించి మూడో గోల్ నమోదు చేయడంతో 3--2తో ఆధిక్యం సాధించింది. మిగిలిన సమయంలో కేప్ వెర్డే సమం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో అర్జెంటీనా క్వార్టర్‌ఫైనల్‌కు అర్హత సాధించగా, ఓటమిపాలైన కేప్ వెర్డే తన అసాధారణ పోరాట అభిమానుల ప్రశంసలు అందుకుంది.




# విజయం వచ్చినా మెస్సీ అసంతృప్తి

ఫిఫా ప్రపంచకప్--2026 రౌండ్ ఆఫ్--32లో కేప్ వెర్డేపై 3--2 తేడాతో కష్టపడి విజయం సాధించి ప్రిక్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్న అర్జెంటీనా జట్టు ఆటతీరుపై కెప్టెన్ లియోనెల్ మెస్సీ అసంతృప్తి వ్యక్తం చేశాడు. గెలుపు దక్కినప్పటికీ జట్టులోని లోపాలు స్పష్టంగా కనిపించాయని, నాకౌట్ దశలో ఇలాంటి తప్పులు పునరావృతమైతే తీవ్ర మూల్యం చెల్లించాల్సి వస్తుందని సహచర ఆటగాళ్లను హెచ్చరించాడు.మయామిలో జరిగిన ఈ ఉత్కంఠభరిత పోరులో నిర్ణీత సమయంలో ఇరు జట్లు 2--2తో సమంగా నిలిచాయి. దీంతో మ్యాచ్ అదనపు సమయానికి వెళ్లింది. అదనపు సమయంలో మెస్సీ కొట్టిన కార్నర్‌ను అర్జెంటీనా ఆటగాడు రొమెరో హెడర్‌తో గోల్‌గా మలిచే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో బంతి కేప్ వెర్డే ఆటగాడి చేతికి తగిలి వారి సొంత గోల్‌పోస్ట్‌లోకి వెళ్లడంతో అర్జెంటీనాకు అదృష్టం కలిసి వచ్చింది. అదే నిర్ణయాత్మక గోల్‌గా మారడంతో 3--2తో విజయం సాధించిన అర్జెంటీనా ప్రిక్వార్టర్‌ఫైనల్‌కు అర్హత సాధించింది. తదుపరి మ్యాచ్‌లో ఈజిప్ట్‌తో తలపడనుంది. మ్యాచ్ అనంతరం మెస్సీ మాట్లాడుతూ జట్టు ప్రదర్శనపై నిరాశ వ్యక్తం చేశాడు. ప్రారంభంలో ఆధిక్యం సాధించిన తర్వాత ఆటను పూర్తిగా తమ నియంత్రణలో ఉంచుకోవాల్సి ఉండగా అలా చేయలేకపోయామని చెప్పాడు. బంతిపై ఆధిపత్యాన్ని కోల్పోవడంతో పాటు ప్రత్యర్థిపై ఒత్తిడి తీసుకురావడంలో విఫలమయ్యామని పేర్కొన్నాడు. కేప్ వెర్డే ఆటగాళ్లు శారీరక బలంతో తమపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారని, అలాంటి పరిస్థితుల్లో జట్టు మరింత మెరుగ్గా ఆడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డాడు.కేప్ వెర్డేను తాము ఏమాత్రం తక్కువగా అంచనా వేయలేదని మెస్సీ స్పష్టం చేశాడు. గతంలో బలమైన జట్లను కూడా ఇబ్బంది పెట్టిన ఆ జట్టు నాకౌట్ దశకు చేరుకోవడం యాదృచ్ఛికం కాదని చెప్పాడు. నాకౌట్ మ్యాచ్‌ల్లో ఏ ప్రత్యర్థినైనా తేలికగా తీసుకుంటే ప్రమాదమేనని, ఇప్పుడు పూర్తిగా ఈజిప్ట్‌తో జరిగే తదుపరి మ్యాచ్‌పైనే దృష్టి సారిస్తామని వెల్లడించాడు.

# డకెట్‌కు కొత్త జోడీ!

**ఏడేళ్ల క్రితం ఇయాన్ మోర్గాన్ నాయకత్వంలో వన్డే ప్రపంచకప్ గెలిచిన ఇంగ్లండ్ మరోసారి ప్రపంచకప్‌పై కన్నేసింది. మెగా టోర్నీకి మరో ఆరు నెలల సమయం మాత్రమే ఉండటంతో జట్టు కూర్పుపై బోర్డు ప్రత్యేక దృష్టి సారించింది. అయితే బెన్ డకెట్‌కు సరైన ఓపెనింగ్ భాగస్వామి ఇంకా దొరకకపోవడం ఆ జట్టుకు తలనొప్పిగా మారింది. గత కొంతకాలంగా ఫిల్ సాల్ట్, జేమీ స్మిత్, జాక్ క్రాలే, రెహాన్ అహ్మద్‌లకు అవకాశాలు ఇచ్చినా వారు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. దీంతో ఇప్పుడు జాకబ్ బెథెల్‌కు అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం.**





వన్డే ప్రపంచకప్--2027 సన్నాహకాల్లో భాగంగా ఇంగ్లండ్ జట్టు ఓపెనింగ్ జోడీని ఖరారు చేసే పనిలో నిమగ్నమైంది. బెన్ డకెట్‌కు స్థిరమైన భాగస్వామి కోసం అన్వేషిస్తున్న ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు యువ బ్యాటర్ జాకబ్ బెథెల్‌పై ఆశలు పెట్టుకుంది. మూడు ఫార్మాట్లలోనూ దూకుడైన ఆటతో ఆకట్టుకుంటున్న ఈ యువ క్రికెటర్ ను భవిష్యత్ ఓపెనర్‌గా తీర్చిదిద్దాలని యోచిస్తోంది. ప్రస్తుతం నాలుగో స్థానంలో బ్యాటిం గ్ చేస్తున్న బెథెల్‌ను భారత్‌తో జరిగే వన్డే సిరీస్‌లోనే డకెట్‌కు జోడీగా పంపే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏడేళ్ల క్రితం ఇయాన్ మోర్గాన్ నాయ కత్వంలో వన్డే ప్రపంచకప్ గెలిచిన ఇంగ్లండ్ మరోసారి ప్రపంచకప్‌పై కన్నేసింది. మెగా టోర్నీకి మరో ఆరు నెలల సమయం మాత్రమే ఉండటంతో జట్టు కూర్పుపై బోర్డు ప్రత్యేక దృష్టి సారించింది. బెన్ డకెట్‌కు సరైన ఓపెనింగ్ భాగస్వామి ఇంకా దొరకకపోవడం ఆ జట్టుకు తలనొప్పిగా మారింది. గత కొంతకా లంగా ఫిల్ సాల్ట్, జేమీ స్మిత్, జాక్ క్రాలే, రెహాన్ అహ్మద్‌లకు అవకాశాలు ఇచ్చినా వారు ఆశించిన స్థాయిలో రాణించ లేకపోయారు. ఇప్పుడు జాకబ్ బెథెల్‌కు అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు స మాచా రం. ఇప్పటివరకు 21 వన్డేలు ఆడి న బెథెల్ 19 ఇన్నింగ్స్ ల్లో 33.50 సగటుతో 603 పరుగులు సాధించాడు. ఇందులో ఐదు అర్ధశతకాలు ఉన్నాయి. అతని అత్యధిక వ్యక్తిగత స్కోరు 110 పరుగులు. దూకుడైన బ్యాటింగ్‌తో పాటు పరిస్థితులకు అనుగుణంగా ఆడగల సామర్థ్యం అతడిని ఓపెనర్‌గా పరిశీలించడానికి ప్రధాన కారణంగా చెబుతున్నారు.

వన్డేలతో పాటు టెస్టుల్లోనూ బెథెల్‌ను ఓపెనర్‌గా ప్రమోట్ చేసే అవకాశాలు ఉన్నాయి. ఇటీవల యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియాపై అతడు అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ముఖ్యంగా సిడ్నీ టెస్టులో 229 బంతుల్లో 142 పరుగులు చేసి తన సత్తా చాటాడు. ఈ ప్రదర్శనతో సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ బెన్ డకెట్‌కు జోడీగా బెథెల్‌ను బరిలోకి దించే దిశగా ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు ఆలోచిస్తున్నట్లు క్రికెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.





# మెక్సికో మ్యాచ్‌కు ఇంగ్లండ్ ప్రత్యేక వ్యూహం

ఫిఫా ప్రపంచకప్ నాకౌట్ దశలో మెక్సికోతో తలపడనున్న ఇంగ్లండ్ జట్టు ఆసక్తికర నిర్ణయం తీసుకుంది. అధిక ఎత్తులో ఉన్న స్టేడియంలో ఆటగాళ్లు శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కోకు ండా ఉండేందుకు వైద్యుల పర్యవేక్షణలో వయాగ్రా మాత్రల వినియోగానికి అనుమతి ఇచ్చినట్లు సమాచారం. ఈ నిర్ణయం ఫుట్‌బాల్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మెక్సికో సిటీలోని ఎస్తాడియో అజ్‌టెకా స్టేడియంలో ఈ నాకౌట్ మ్యాచ్ జరగనుంది. సముద్ర మట్టానికి సుమారు 2,240 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ మైదానంలో ఆక్సిజన్ సాంద్రత తక్కువగా ఉండటంతో ఆటగాళ్లు త్వరగా అలసిపోయే అవకాశం ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇంగ్లండ్ జట్టు ప్రత్యేక సన్నాహాలు చేసింది. ఇప్పటికే ఆటగాళ్లు తగినంత విశ్రాంతి తీసుకునేలా ఏర్పాట్లు చేసిన జట్టు యాజమాన్యం, మ్యాచ్ సమయంలో శారీరక సామర్థ్యాన్ని నిలబెట్టేందుకు వైద్యపరమైన సూచనల మేరకు వయాగ్రా వినియోగానికి కూడా అనుమతించినట్లు తెలుస్తోంది. అధిక ఎత్తులో రక్తనాళాలు విస్తరించి రక్తప్రసరణ మెరుగు పడేందుకు వయాగ్రా కొంతమేర ఉపయోగపడుతుందని గతంలో కొన్ని వైద్య పరిశోధనలు సూచించాయి. ఇదే కారణంతో ఇంగ్లండ్ జట్టు ఈ మార్గాన్ని పరిశీలించినట్లు సమాచారం. సాధారణంగా ఈ ఔషధాన్ని వేరే వైద్య అవసరాల కోసం వినియోగించినప్పటికీ, అధిక ఎత్తులో శారీరక సామర్థ్యాన్ని మెరుగుపర్చే అవకాశాలపై కూడా కొన్ని అధ్యయనాలు జరిగాయి. ఆతిథ్య మెక్సికో ఆటగాళ్లకు అక్కడి వాతావరణం, ఎత్తైన మైదాన పరిస్థితులు అలవాటై ఉండటంతో వారికి పెద్దగా ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు. అయితే ఇంగ్లండ్ ఆటగాళ్లు అలసటకు గురికాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. వరుస విజయాలతో ఆత్మవిశ్వాసంగా ఉన్న మెక్సికోను నిలువరించేందుకు ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రత్యేక వ్యూహాలతో బరిలోకి దిగుతున్నట్లు జట్టు వర్గాలు వెల్లడించాయి.




# పెద్ది ఓటీటీ విడుదలకు ముహూర్తం

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' థియేటర్లలో ఘనవిజయం సాధించిన తర్వాత ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. గ్రామీణ క్రీడల నేపథ్యంలో రూపొందిన ఈ భావోద్వేగ క్రీడా కథ ప్రపంచవ్యాప్తంగా విశేష ఆదరణ పొందడంతో పాటు రూ.400 కోట్లకు పైగా స్థూల వసూళ్లు సాధించింది. ఈ చిత్రం డిజిటల్ హక్కులను దక్కించుకున్న నెట్‌ఫ్లిక్స్ సంస్థ జులై 9 నుంచి చిత్రాన్ని ప్రసారం చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళ భాషల్లోనూ ఒకేసారి ఈ చిత్రం అందుబాటులోకి రానుంది. దీంతో థియేటర్లలో చూడలేకపోయిన ప్రేక్షకులకు ఇంటి వద్దే సినిమాను వీక్షించే అవకాశం లభించనుంది. విడుదలైన తొలి రోజు నుంచే 'పెద్ది'కి ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించింది. గ్రామీణ వాతావరణం, క్రీడా అంశాలు, కుటుంబ భావోద్వేగాలు, . ముఖ్యంగా రామ్ చరణ్ నటన, పాత్ర లోని భావోద్వేగం, యాక్షన్ సన్నివేశాలు చిత్రానికి ప్రధాన బలంగా నిలిచాయి. ప్రపంచవ్యాప్తంగా రూ.400 కోట్లకు పైగా స్థూల వసూళ్లు సాధించి రామ్ చరణ్ సినీ జీవితంలో మరో భారీ విజయంగా నిలిచింది.




# ఈవీవీ సినిమా బ్యానర్‌లో కొత్త ప్రేమకథ

తెలుగు చిత్రసీమలో వినోదాత్మక చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు పొందిన ఈవీవీ సినిమా బ్యానర్ సుదీర్ఘ విరామం తర్వాత మరో కొత్త చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రముఖ దర్శకుడు స్వర్గీయ ఈ.వీ.వీ. సత్యనారాయణ స్థాపించిన ఈ నిర్మాణ సంస్థపై గతంలో ఎన్నో విజయవంతమైన చిత్రాలు తెరకెక్కగా, ఇప్పుడు ఆయన తనయుడు, నటుడు ఆర్యన్ రాజేష్ హోమ్ బ్యానర్‌ను మళ్లీ చురుకుగా చేస్తూ కొత్త ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు. ఈ చిత్రాన్ని ఆర్యన్ రాజేష్‌తో పాటు నిర్మాత ఎన్.వి. కృష్ణారెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈవీవీ సినిమా పతాకంపై పదో చిత్రంగా, ఎన్‌వీఆర్ ఎంటర్‌టైన్‌మెంట్స్ తొలి నిర్మాణంగా ఈ సినిమా రూపొందుతోంది. నిజ జీవితంలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా సాగే భావోద్వేగ ప్రేమకథను ఈ చిత్రానికి కథాంశంగా ఎంపిక చేశారు. యువ నటుడు హర్ష్ రోషన్ కథానాయకుడిగా నటిస్తుండగా, ప్రియాంక ఆచర్ కథానాయికగా కనిపించనున్నారు. గతంలో 'కోర్ట్' చిత్రంలో తన నటనతో ప్రశంసలు అందుకున్న హర్ష్ రోషన్ ఈ చిత్రంలో మరో విభిన్న పాత్రలో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్రానికి అరుణ్ బాలాజీ, శ్రీ రంజని సంయుక్తంగా దర్శకత్వం వహిస్తున్నారు. మానవ సంబంధాలు, భావోద్వేగాలు, ఈ తరం ప్రేమలోని సంక్లిష్టతలను ప్రతిబింబించే కథను వాస్తవికంగా తెరకెక్కిస్తున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఇటీవల హైదరాబాద్‌లో సినీ ప్రముఖుల సమక్షంలో శుభ ముహూర్తపు పూజా కార్యక్రమాలతో చిత్రాన్ని ఘనంగా ప్రారంభించారు. త్వరలోనే రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు నిర్మాతలు వెల్లడించారు. ఈ చిత్రానికి జిజు సన్నీ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తుండగా, వినీల్ నల్లమిల్లి కార్యనిర్వాహక నిర్మాతగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విష్ణు తేజ్ పుట్ట మార్కెటింగ్ బాధ్యతలు చేపట్టగా, మదూరి మధు ప్రచార బాధ్యతలను నిర్వహిస్తున్నారు. హర్ష్ రోషన్, ప్రియాంక ఆచర్‌తో పాటు పలువురు ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. చిత్రానికి సంబంధించిన పేరు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నట్లు చిత్రబృందం తెలిపింది.

# జారా సేవలపై త్రిష అసంతృప్తి

ప్రముఖ నటి త్రిష కృష్ణన్ అంతర్జాతీయ దుస్తుల బ్రాండ్ జారాపై సామాజిక మాధ్యమాల వేదికగా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసిన దుస్తులు నాణ్యత లేకుండా రావడంతో పాటు వాటి నుంచి దుర్వాసన వస్తోందని ఆరోపిస్తూ ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందించారు. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చకు దారితీశాయి. త్రిష తన ఇన్‌స్టాగ్రామ్ కథనంలో జారా నుంచి వరుసగా మూడు సార్లు వచ్చిన దుస్తుల నుంచి చెమట వాసన వస్తోందని పేర్కొన్నారు. వినియోగదారులకు పంపించే ముందు ఉత్పత్తులను సరిగా తనిఖీ చేసి పంపాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయి సంస్థ నుంచి ఇలాంటి అనుభవం ఎదురవుతుందని ఊహించలేదని ఆమె వ్యాఖ్యానించారు. త్రిష చేసిన ఈ వ్యాఖ్యలపై పలువురు నెటిజన్లు కూడా స్పందిస్తూ తమకు జారా సేవల విషయంలో ఎదురైన అనుభవాలను పంచుకున్నారు. కొందరు ఉత్పత్తుల నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేయగా, మరికొందరు డెలివరీ సేవలపై విమర్శలు చేశారు. అయితే ఈ అంశంపై జారా సంస్థ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. ఇదే సమయంలో త్రిష మరో ఇన్‌స్టాగ్రామ్ కథనాన్ని కూడా పంచుకున్నారు.





కోలీవుడ్‌లో వరుస విజయాలతో అగ్ర దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న లోకేశ్ కనగరాజ్ ఇప్పుడు నిర్మాతగా కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దర్శకుడిగా 'ఖైదీ', 'విక్రమ్', 'లియో', 'కూలీ' వంటి విజయవంతమైన చిత్రాలను అందించిన ఆయన, ప్రస్తుతం హీరోగా 'డీసీ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఇదే సమయంలో నిర్మాతగా కూడా కొత్త ప్రయాణానికి శ్రీకారం చుడుతున్నట్లు సమాచారం. లోకేశ్ నిర్మించనున్న తొలి చిత్రం మహిళా ప్రధాన కథాంశంతో రూపొందనున్నట్లు తెలుస్తోంది.

ఈ చిత్రానికి విశాల్ వెంకట్ దర్శకత్వం వహించనుండగా, కథానాయికగా రెజీనా కసాండ్రా నటించనున్నట్లు సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. కథ సిద్ధమైందని, చిత్రీకరణ కూడా త్వరలో ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని సమాచారం. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం 'డీసీ' సినిమా ప్రచార కార్యక్రమాల్లో బిజీగా ఉన్నప్పటికీ, తన తదుపరి ప్రాజెక్టులపై కూడా లోకేశ్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు సమాచారం. దర్శకుడిగా, హీరోగా మాత్రమే కాకుండా నిర్మాతగా కూడా తనదైన ముద్ర వేయాలనే లక్ష్యంతో ఆయన ముందుకు సాగుతున్నారని



# రీమేక్ కాదు.. ఒరిజినల్ కథే: కీర్తి సురేష్

**ఈ చిత్రం ఏ సినిమాకూ రీమేక్ కాదని, దర్శకుడు అనిల్ రావిపూడి స్వయంగా రాసుకున్న ఒరిజినల్ కథతో తెరకెక్కుతోందని వెల్లడించారు. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. హాస్యం, కుటుంబ భావోద్వేగాల సమ్మేళనంగా ఈ చిత్రాన్ని అనిల్ రావిపూడి తనదైన శైలిలో రూపొందిస్తున్నారు.**

విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న మల్టీస్టారర్ చిత్రంపై వస్తున్న రీమేక్ వార్తలకు హీరోయిన్ కీర్తి సురేష్ తెరదించారు. ఈ సినిమా మలయాళ హిట్ చిత్రం 'గురువాయూర్ అంబలనాడైల్'కు రీమేక్ అనే ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని ఆమె స్పష్టం చేశారు.

సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో స్పందించిన కీర్తి సురేష్.. ఈ చిత్రం ఏ సినిమాకూ రీమేక్ కాదని, దర్శకుడు అనిల్ రావిపూడి స్వయంగా రాసుకున్న ఒరిజినల్ కథతో తెరకెక్కుతోందని వెల్లడించారు. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. హాస్యం, కుటుంబ భావోద్వేగాల సమ్మేళనంగా ఈ చిత్రాన్ని అనిల్ రావిపూడి తనదైన శైలిలో రూపొందిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్ సమర్పిస్తోంది. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన కీర్తి సురేష్ కథానాయికగా నటిస్తుండగా, కళ్యాణ్ రామ్‌కు జోడీగా కృతి శెట్టి కనిపించనుంది. సంగీతాన్ని జాతీయ పురస్కార గ్రహీత జీవీ ప్రకాశ్ కుమార్ అందిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ శరవేగంగా కొనసాగుతోంది.

2027 సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేయాలని చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467